

KADILIMCHE VAARTHA Telugu daily
కదిలించే వార్త
తెలుగు దినపత్రిక

TV6 NATIONAL NEWS CHANNEL

బ్యూరో చీఫ్ జోడు రమేష్ కుమార్, కడప జిల్లా, అన్నమయ్య జిల్లా సంపుటి : 11 సంచిక : 208 బుధవారం 29 జులై 2026 పేజీలు 8 వెల : 05

Published From Kadapa : Circulated at | Ananthapuram | Tirupati | Vishakapatnam | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Vijayawada | Ongole | Chittore | Khammam | Hyderabad | Mahabubnagar

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు ముందు హైడ్రామా

- శాఖ మార్పునకు కేంద్రం ప్రతిపాదన
- ప్రచారాన్ని ఖండించిన బీజేపీ
- మొదట ధర్మేంద్ర ప్రధాన్ శాఖ మార్చేందుకు కేంద్రం సిద్ధమైందని సమాచారం
- రాజీనామా తప్ప మరో ప్రత్యామ్నాయం అంగీకరించబోమన్న సీజేపీ ప్రతినిధులు
- ప్రజల్లో గందరగోళం సృష్టించేందుకు కొందరు ఉద్దేశపూర్వకంగా చేసిన ప్రయత్నమనే ఇది
- ప్రధాన్ మంత్రిత్వ శాఖ మారుస్తామన్న ప్రతిపాదనేదీ కేంద్రం చేయలేదు



## 'పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఎన్నికలు కపట నాటకం

- ఆక్రమణలు, దారుణాల్ని కప్పిపుచ్చే డ్రామా'
- పాకిస్థాన్‌పై భారత్ మరోసారి తీవ్ర ఆగ్రహం
- పీఓకేలో స్థానిక సంస్థల ఎన్నికలు అక్రమ ఆక్రమణల్ని దాచే ప్రయత్నమేనని విదేశాంగ శాఖ విమర్శలు
- జమ్మూకశ్మీర్, లద్దాఖ్ సహా పాక్ ఆక్రమించిన ప్రాంతాలు భారత్‌లో అంతర్భాగమేనని స్పష్టం



## పనుల్లో నాసిరకం..
# బిల్లులు నిలిపివేయండి



- నాణ్యతపై నివేదిక ఆవ్వాలని అధికారులకు డిప్యూటీ సీఎం పవన్ ఆదేశం
- పెదపెంకిలో అభివద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచన.
- నాణ్యతా ప్రమాణాలు పాటించని కాంట్రాక్టర్‌పై తక్షణం చర్యలు తీసుకోవాలి
- సంబంధిత పనుల బిల్లులను వెంటనే నిలిపివేయాలి



## ప్రహ్లాద్ జోషి రేపిస్టుల మద్దతుదారు

- ఆయనకు విద్యాశాఖ బాధ్యతలు కట్టబెట్టడం దారుణం
- దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన బిల్కిస్ బానో కేసులో శిక్షపడిన దోషులను ప్రహ్లాద్ జోషి వెనకేసుకొచ్చారని రాహుల్ విమర్శ
- బీజేపీ ఒక అత్యాచార దోషుల రక్షకుడిని మంత్రి కుర్చీలో కూర్చోబెట్టింది.
- "అన్నింటికన్నా మనకు ఈ దేశ రాజ్యాంగం గొప్పది, ప్రజాస్వామ్యమే సర్వోన్నతమైనది
- దానిని నాశనం చేయడం పాపం
- ఈ దేశంలోని కోట్లాది ప్రజలు మనల్ని కోరుకునేది ఒక్కటే, అదే జవాబుదారీతనంల

# వరి పంటపై తీవ్ర ప్రభావం



- ఏపీలో ఇప్పటికి 69 శాతం వర్షపాతం లోటు
- ఎల్‌నినో ప్రభావంపై రైతుల్లో అవగాహన కల్పించండి
- సమీక్షలో సీఎం చంద్రబాబు నాయుడు

**అమరావతి**

రాష్ట్రంపై ఎల్‌నినో ప్రభావం, ప్రభుత్వ పరంగా తీసుకోవాల్సిన చర్యలు, రైతుల్లో కల్పించాల్సిన అవగాహనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంగళవారం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జూలై నెలలో 69 శాతం లోటు వర్షపాతం నమోదైనట్లు తెలిపిన అధికారులు. వచ్చే మూడు నెలల్లో సరాసరి 35 నుంచి 40 శాత మేర లోటు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందన్న అధికారులు. జూన్ -- నవంబర్ మధ్య 844 మి.మీ వర్షపాతం - మిగతా 3లో



- ఏపీ ప్రభుత్వంతో ఎంఓయూ కుదుర్చుకున్న ఆస్ట్రాజెనెకా ఇండియా
- సీఎం చంద్రబాబు సమక్షంలో ఎంఓయూ కుదుర్చుకున్న ఫార్మా సంస్థ
- రిలయన్స్‌కు చెందిన స్ట్రాండ్ లైఫ్ సైన్సెస్, క్యూఆర్ఏఐ సంస్థలతో కలిసి ఆస్ట్రా జెనెకా ఇండియా ఇంటిగ్రేటెడ్ జెనోమిక్ సొల్యూషన్స్ సెంటర్ ఏర్పాటు

## అమరావతిలో జెనోమిక్ సొల్యూషన్
# సెంటర్

**అమరావతి**

కాన్సర్ రంగంలో జన్యుపరమైన పరిశోధనల ద్వారా వైద్య చికిత్సలను అందించేందుకు వీలుగా కీలకమైన ముందడుగు పడింది. అమరావతిలో ఇంటిగ్రేటెడ్ ప్రెసిషన్ అంకాలజీ విధానాన్ని ప్రారంభించేందుకు వీలుగా అంతర్జాతీయ ఫార్మాసుటికల్, బయో టెక్నాలజీ దిగ్గజ సంస్థ ఆస్ట్రాజెనెకా ఇండియా ఏపీ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. అమరావతిలో ఇంటిగ్రేటెడ్ జెనోమిక్స్ సొల్యూషన్ సెంటర్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఎంఓయూ కుదుర్చుకుంది. సీఎం చంద్రబాబు నాయుడు సమక్షంలో వైద్యారోగ్యశాఖ-- ఆస్ట్రాజెనెకా ఇండియా సంస్థల ప్రతినిధులు ఒప్పందాలపై సంతకాలు చేశారు. రిలయన్స్‌కు చెందిన స్ట్రాండ్ లైఫ్ సైన్సెస్, క్యూఆర్ఏఐ సంస్థలతో కలిసి ఆస్ట్రా జెనెకా ఇండియా ఇంటిగ్రేటెడ్ జెనోమిక్ సొల్యూషన్స్ సెంటర్ ఏర్పాటు చేయనుంది. అమరావతిలో దేశంలోనే మొట్టమొదటి - మిగతా 3లో



## రూ.2000 కోట్ల విలువైన భూమిని జప్తు నుంచి
# కాపాడుతాం

- ఉప సభాపతి, అసెంబ్లీ ఫిర్యాదుల కమిటీ చైర్మన్ కె.రఘురామకృష్ణ రాజు
- ఏపీ రిఫ్రాక్టరీస్ సంస్థ పరిశ్రమ నెలకొల్పేందుకు 1981లో రాష్ట్ర ప్రభుత్వం 174.43 ఎకరాల భూమిని కేటాయించగా చేయగా ఆ సంస్థ దివాలా తీయడంతో ప్రస్తుతం ఆ భూమి జప్తునకు గురయ్యే ప్రమాదం
- ఆగస్టు మొదటి వారంలో ఉన్నతాధికారులు,బ్యాంకర్లతో మరోసారి ఫిర్యాదుల కమిటీ సమావేశం నిర్వహించి సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నం చేస్తాం

## జనసంద్రమైన సింహాచలం..

- వేడుకగా 32 కిలోమీటర్ల గిరి ప్రదక్షిణ
- ప్రారంభమైన సింహాచలం గిరి ప్రదక్షిణ మహోత్సవం
- అప్పన్న నామస్మరణతో కిటకిటలాడుతున్న 32 కి.మీ. మార్గం
- 10 లక్షల మందికి పైగా పాల్గొంటారని అధికారుల అంచనా
- భక్తుల కోసం భారీ ఏర్పాట్లు.. డ్రోన్లతో పోలీసుల పర్యవేక్షణ
- స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో అన్నదానం, మంచినీటి పంపిణీ



# ఆరెస్సెస్ వ్యక్తికే కేంద్ర విద్యాశాఖ పగ్గాలా?

**ఎన్‌టీఏ, ఎన్ ఈపీని రద్దు వరకు ఉద్యమం**
**విద్యార్థులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలి**
**కాక్రోచ్ ఆందోళనలకు సీపీఐ సంపూర్ణ మద్దతు**
**బొద్దింకలకు భయపడుతున్న మోదీ, అమిత్‌షా**
**ఏపీలో తీవ్రమైన కరువు పరిస్థితులు**
**కరువు తీవ్రతపై సీఎం చంద్రబాబు స్పందించాలి**
**సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ**




**విజయవాడ :** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేసిన తర్వాతయినా బుద్ధి రాలేదని, రాజీనామా చేసిన ఎంపీని పార్లమెంట్‌లో బీజేపీ సన్మానించడం సిగ్గుచేటని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ ధ్వజమెత్తారు. విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. విజయవాడ దాసరి భవన్‌లో మంగళవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. విద్యార్థి ఉద్యమాల ఒత్తిడి, దేశవ్యాప్తంగా కొనసాగిన 49 రోజుల నిరసనలు, అనేక ప్రాంతాల్లో జరిగిన పోలీసు లాఠీచార్జీలు, బలప్రయోగం అనంతరమే కేంద్ర మంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి వచ్చిందని ఆయన గుర్తుచేశారు. అయితే రాజీనామా చేసిన మంత్రిని పార్లమెంట్‌లో సత్కరించడం సిగ్గుమాలిన చర్యని తూర్పారబట్టారు. ఇది విద్యార్థుల త్యాగాలను, వారి ఆందోళనలను కేంద్ర ప్రభుత్వం అవమానించడమేనని అన్నారు. ఇంతకుముందు ఏబీవీపీగా చేసిన వారికి, ఇప్పుడు ఆరెస్సెస్‌గా పని చేసిన వారికే తిరిగి విద్యామంత్రి పీఠం కట్టబెట్టడం దుర్మార్గమని అన్నారు. మతం రంగు పులిమి విద్యా వ్యవస్థను ముందుకు తీసుకెళ్తున్నారని, కేంద్ర ప్రభుత్వం తన వైఖరి మార్చుకోవాలని హితవు పలికారు. కేంద్ర విద్యా శాఖమంత్రిగా ఎన్డీఏలోని లౌకికవాద వ్యక్తిని ఎందుకు నియమించలేదని సూటిగా ప్రశ్నించారు. విద్యార్థిని కాల్చాలంటూ అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డిని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై దేశ వ్యాప్తంగా లక్షలాది మంది ఉద్యమించారని, వారిపై నమోదు చేసిన కేసులు ఇంకా తొలగించలేదని, తక్షణమే కేసులను రద్దు చేయాలన్నారు. విద్యార్థి ఉద్యమాల సందర్భంగా దేశవ్యాప్తంగా నమోదైన కేసులను ఉపసంహరిస్తామని కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ఇప్పటికీ అమలు కాలేదన్నారు. కేసులను తక్షణమే ఉపసంహరించి విద్యార్థులపై ఉన్న అన్ని వేధింపులను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం హామీలను అమలు చేయకపోతే విద్యార్థి సంఘాలు తమ ఆందోళనలను మరింత విస్తృత స్థాయిలో కొనసాగిస్తాయని హెచ్చరించారు.

విద్యార్థుల సమస్యలకు ప్రధాన కారణంగా మారిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)ను వెంటనే రద్దు చేయాలని, జాతీయ విద్యా విధానం-2020 (ఎన్ ఈపీ-2020)ను ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ విధానం ప్రభుత్వ విద్యను బలహీనపరచి విద్యను కార్పొరేటీకరణ, వాణిజ్యీకరణ, కాషాయీకరణ దిశగా నడిపిస్తోందని విమర్శించారు. ఎన్‌టీఏ రద్దు, జాతీయ విద్యా విధానం ఉపసంహరణ జరిగే వరకు విద్యార్థి సంఘాలు తమ ఉద్యమాన్ని కొనసాగిస్తాయని స్పష్టం చేశారు. గత 12 ఏళ్లుగా ప్రధాని మోదీ, అమిత్‌షా అన్ని పార్టీలను, చివరకు ముఖ్యమంత్రులను సైతం బెదిరించారని, ఇవాళ బొద్దింకలకు భయపడే పరిస్థితి మోడీ, అమిత్ షాలకు దాపురించిందని ఎద్దేవా చేశారు. పార్టీ నిర్మాణంపైనే సీఎం చంద్రబాబు దృష్టి పెడుతూ, ఇంటి ఇంటికి టీడీపీ అంటూ తిరుగుతున్నారని అన్నారు. మరోవైపు రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితుల పైనా సీఎం స్పందించాలన్నారు. రాష్ట్రంలో నెలకొన్న తీవ్ర కరువు పరిస్థితులపై రామకృష్ణ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఎల్‌నినో ప్రభావంతో దశాబ్దాలుగా చూడని స్థాయిలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయని తెలిపారు. రాష్ట్రంలో వర్షపాతం లోటు సుమారు 54 శాతం నమోదైందని, ప్రభుత్వ గణాంకాల ప్రకారం 28 జిల్లాల్లో 21 జిల్లాలు వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని వివరించారు. 608 మండలాల్లో వర్షపాతం లోటు నమోదవ్వగా, వాటిలో 249 మండలాలు తీవ్రమైన కరువు ప్రభావిత ప్రాంతాలుగా మారాయని తెలిపారు. అనంతపురం, సత్యసాయి జిల్లాల్లో విస్తారమైన భూములు బీడుగా మారాయని, ఇప్పటికే సాగు చేసిన పంటలు వర్షాభావంతో ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 30.80 లక్షల హెక్టార్లలో సాగు జరగాల్సి ఉండగా, ఇప్పటివరకు కేవలం 16.40 లక్షల హెక్టార్లలో మాత్రమే పంటలు సాగయ్యాయని వివరించారు. దాదాపు సగం వ్యవసాయ భూములు సాగుకు దూరమయ్యాయని తెలిపారు. రాష్ట్ర కరువు పరిస్థితులపై సీఎం చంద్రబాబును కలిసి వినతిపత్రం సమర్పిస్తామని రామకృష్ణ వెల్లడించారు. వర్షాలు ఆలస్యమైతే రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై వ్యవసాయశాఖ స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయాలని, అవసరమైన విత్తనాలు, ఎరువులను ఉచితంగా అందించాలని, కరువు నివారణ చర్యల కోసం ప్రభుత్వ యంత్రాంగాన్ని వెంటనే అప్రమత్తం చేయాలని డిమాండ్ చేశారు. రాజకీయ కార్యక్రమాల కంటే రైతుల రక్షణ, కరువు నివారణ చర్యలకు ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలని, ఈ విషయంలో అన్ని రాజకీయ పార్టీలు నిర్మాణాత్మక సహకారం అందించాలని ఆయన కోరారు. ఈ విలేకరుల సమావేశంలో సీపీఐ రాష్ట్ర

# ఢిల్లీ పర్యటనపై జగన్ మైండ్ గేమ్

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేయబోతున్నట్లుగా ప్రచారం జరుగుతున్న ఢిల్లీ పర్యటన , ముఖ్యంగా ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాల అపాయింట్‌మెంట్‌లు ఎప్పుడూ అత్యంత ఆసక్తికరమైన రాజకీయ చర్చలకు దారితీస్తున్నాయి. ఇంత వరకూ అపాయింట్ మెంట్ ఖరారైనట్లుగా స్పష్టత లేదు కానీ.. భేటీ ఉంటుందని వైఎస్ఆర్‌సీపీ వర్గాలంటున్నాయి. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా.. కేంద్ర పెద్దలకు తమపైనే ప్రత్యేక అభిమానం ఉందనే సంకేతాలను కేడర్‌లోకి పంపడంలో వైఎస్సార్‌సీపీ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తూ వస్తోంది. క్షేత్రస్థాయి ప్రచారంలో టీడీపీ, జనసేనలతో బీజేపీ, కేవలం ఎన్నికల పొత్తు మాత్రమే పెట్టుకుంది, కానీ మోదీ-షాలకు జగన్ అంటేనే ప్రత్యేక ఇష్టం అనే భావనను నిలబెట్టే ప్రయత్నం నిరంతరం సాగుతుంటుంది. కూటమి ప్రభుత్వంపై ఫిర్యాదు చేసేందుకు జగన్‌కు మోదీ-షాలు అపాయింట్‌మెంట్ ఇస్తే ఏపీ రాజకీయ సమీకరణాలు ఎలా మారుతాయనేది ఆసక్తికరంగా మారింది.వైఎస్సార్‌సీపీ వ్యూహాన్ని లోతుగా పరిశీలిస్తే.. ఢిల్లీలో కేంద్ర పెద్దల భేటీ లభిస్తే దాన్ని వెంటనే కూటమిపై మైండ్ గేమ్ ఆడేందుకు ఉపయోగించుకుంటుంది. తమ నేతపై కేంద్ర దర్యాప్తు సంస్థల కదలికలు మందగించడానికి, కూటమి ప్రభుత్వం పగటిపూట చేసే విచారణలకు కేంద్రం వద్ద మద్దతు లభించడం లేదని నిరూపించడానికి ఈ అపాయింట్‌మెంట్‌ను ఒక రుజువుగా చూపే అవకాశం ఉంది. జగన్ విజ్ఞప్తులను వినడానికి ప్రధాని లేదా హోంశాఖ మంత్రి సమయం కేటాయిస్తే.. చూశారా! కూటమి ఎన్ని ఆరోపణలు చేసినా కేంద్రం జగన్ మాటకే ప్రాధాన్యం ఇస్తోంది అని క్షేత్రస్థాయిలో జోరుగా ప్రచారం చేసుకోవడం



ద్వారా సొంత కేడర్‌లో ధైర్యం నూరిపోసేందుకు వైసీపీకి అవకాశం లభిస్తుంది. ఇక కూటమి పరంగా చూస్తే.. ప్రధాని లేదా హోంశాఖ మంత్రి జగన్‌కు ముఖాముఖి సమయం ఇవ్వడం కూటమి శ్రేణుల్లో సాంకేతికంగా కొంత గందరగోళాన్ని సృష్టించే ముప్పు ఉందనేది కొట్టిపారేయలేని నిజం. ముఖ్యంగా టీడీపీ, జనసేన శ్రేణులు సుదీర్ఘ పోరాటం చేసి సాధించిన చారిత్రాత్మక విజయం తర్వాత, వైసీపీ శ్రేణులకు అంతర్గతంగా పొందే ఒక నైతిక విజయం గా ఇది రూపాంతరం చెందే ప్రమాదం ఉంది. కూటమి ప్రభుత్వం చేపడుతున్న విచారణలు, అరెస్టులపై జగన్ ఇచ్చే వినతిపత్రాలు ఢిల్లీ స్థాయిలో చర్చనీయాంశమైతే, అది కూటమి ఐక్యత , ప్రభుత్వ ఇమేజ్‌పై స్వల్ప ప్రభావం చూపవచ్చనే ఆందోళన స్థానిక నేతల్లో వ్యక్తమవుతుంటుంది. ఢిల్లీ రాజకీయాల యంత్రాంగాన్ని డీకోడ్ చేస్తే.. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ అగ్రనాయకత్వం నరేంద్ర మోదీ, అమిత్ షాలు అంత సులభంగా విపక్షాల ట్రాప్‌లో పడే అవకాశాలు లేవని స్పష్టమవుతోంది. రాజకీయ వ్యూహకర్తగా అమిత్ షా వైఖరి ఎప్పుడూ స్పష్టంగా ఉంటుంది. ప్రాంతీయ పార్టీల అంతర్గత కలహాల్లో దూరి తమ మిత్రపక్షాలకు ఇబ్బంది కలిగించే రాజకీయాలకు వారు దూరంగా ఉంటారు. ప్రస్తుతం ఏపీలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం అత్యంత బలమైన మెజారిటీతో, చంద్రబాబు సీఎంగా, పవన్ కళ్యాణ్ డిప్యూటీ సీఎంగా సుస్థిర పాలన అందిస్తోంది. ఇటువంటి సమయంలో కూటమి ఐక్యతకు హాని కలిగించే లేదా మిత్రపక్షాల్లో అనుమానాలు రేకెత్తించే సంకేతాలను అధిష్టానం ఇవ్వాలనుకోదు.ప్రజాస్వామ్య వ్యవస్థలో ఒక రాష్ట్రానికి చెందిన ప్రధాన ప్రతిపక్ష నాయకుడు లేదా మాజీ ముఖ్యమంత్రి సమయం కోరినప్పుడు, నిబంధనల ప్రకారం లేదా సాధారణ ప్రోటోకాల్ ప్రకారం వినతిపత్రాలు స్వీకరించడం కేంద్ర మంత్రుల విధి. అయితే, దాన్ని ప్రత్యేక రాజకీయ సంబంధంగా చిత్రీకరించే వైసీపీ ప్రయత్నాలను అటు బీజేపీ జాతీయ వర్గాలు కూడా గమనిస్తూనే ఉన్నాయి. అందుకే ఒకవేళ అపాయింట్‌మెంట్ ఇచ్చినప్పటికీ, అది కేవలం ప్రజాస్వామ్యబద్ధమైన వినతుల స్వీకరణకే పరిమితమని, ఎన్డీయే భాగస్వామ్య పక్షాలైన టీడీపీ, జనసేనలకు ఇచ్చే ప్రాధాన్యతలో ఎలాంటి మార్పు ఉండదని స్పష్టమైన సంకేతాలను బీజేపీ ఇస్తోంది. మోదీ, షాలు ఇచ్చే సాధారణ అపాయింట్‌మెంట్‌ను రాజకీయ ప్రచారానికి వాడుకోవాలని చూసినప్పటికీ, అది కూటమి పునాదులను కదిలించే స్థాయికి వెళ్లకపోవచ్చని భావిస్తున్నారు. చంద్రబాబు రాజకీయ అనుభవం, పవన్ కళ్యాణ్ బీజేపీతో కొనసాగిస్తున్న దృఢమైన బంధం ముందు జగన్ భేటీలు తాత్కాలిక సంచలనాలకే పరిమితమవుతాయి. ఎన్డీయే కూటమి తన పరిపాలనాజెండాతో ముందుకు సాగుతున్నంత కాలం, ఢిల్లీ భేటీల పేరుతో సాగే పొలిటికల్ మైండ్ గేమ్‌లు ఏపీ అసలు రాజకీయ సమీకరణాలను మార్చలేవని ఎక్కువ మంది భావిస్తున్నారు

# నిన్న కర్నూలు.. ఇవాళ చిత్తూరు
# రాయలసీమలో బంగారు గనులు

**తిరుపతి :** కర్నూలు జిల్లా జొన్నగిరిలోని బంగారు గనిలో విజయవంతంగా బంగారం ఉత్పత్తి మొదలైంది. దీంతో రాష్ట్రంలో మరో భారీ బంగారు గని అభివృద్ధికి ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది.. చిత్తూరు జిల్లా చిగురుగుంట-బి. సానత్తం బంగారు గనులను దక్కించుకునేందుకు ఏపీ ఖనిజాభివృద్ధి సంస్థ (ఏపీఎండీసీ) ఈ-వేలంలో పాల్గొనేందుకు సిద్ధమైంది. ఈ గనుల్లో సుమారు 22 లక్షల టన్నుల బంగారు ఖనిజ నిల్వలు ఉన్నట్లు అంచనా. మొత్తం 12,500 కిలోల వరకు బంగారం వెలికితీసే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఈ గనులను నేరుగా ఏపీఎండీసీకి రిజర్వ్ చేయాలని కేంద్రాన్ని కోరేందుకు రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రయత్నాలు ప్రారంభించింది. కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇస్తే.. ఏపీకి ఆర్థికంగా భారీగా స్థాయిలో మేలు జరిగే అవకాశాల ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.చిగురుగుంట-బి సానత్తంలో 22లక్షల టన్నుల బంగారు ఖనిజ నిల్వలున్నట్లు అధికారులు గుర్తించారు. టన్ను ఖనిజాన్ని తవ్వితీసి శుద్ధి చేస్తే సగటున 5.64గ్రాముల బంగారం వస్తుందని అంచనా వేశారు. దీంతో ఈ గని నుంచి 12,500 కిలోల బంగారాన్ని వెలికితీయొచ్చునని అధికారులు భావిస్తున్నారు ఇక్కడ గతంలో భారత్ గోల్డ్ మైన్స్ ఆధ్వర్యంలో తవ్వకాలు జరిగాయి. 2001 సంవత్సరంలో తవ్వకాలను నిలిపివేశారు. 2018లో నిర్వహించిన ఈ-వేలంలో జాతీయ ఖనిజాభివృద్ధి సంస్థ (ఎన్



ఎండీసీ) వీటిని దక్కించుకుంది. అయితే, కొన్ని ఇబ్బందుల వల్ల లీజును వదలుకుంది. ప్రస్తుతం ఇక్కడి గనులకు టెండర్లు పిలిచారు. దీంతో ఏపీ ప్రభుత్వం రంగంలోకి దిగింది. ఈ గనుల లీజును ఏపీఎండీసీ దక్కించుకొని బంగారం వెలికితీయాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఈనెలాఖరు వరకు బిడ్ల దాఖలుకు అవకాశం ఉండగా.. ఈ-వేలంలో పాల్గొనేందుకు ఏపీఎండీసీ సిద్ధమైంది.బంగారం, బొగ్గు, బాక్సైట్ వంటి మేజర్ మినరల్స్ ను వేలం ద్వారా కేటాయిస్తున్నారు. ప్రభుత్వ రంగ సంస్థలైనా వేలంలో పాల్గొని లీజులు పొందాల్సిందే. అయితే, ఇటీవల తెలంగాణ రాష్ట్రంలోని రెండు బొగ్గు బ్లాక్ లకు వేలం లేకుండా సింగరేణికి నేరుగా రిజర్వు చేశారు. ఒడిశాలోనూ ఓ బాక్సైట్ లీజును ఒడిశా ఖనిజాభివృద్ధి సంస్థకు కేటాయించారు. దీంతో చిగురుగుంట -బి సానత్తం గనులను వేలం లేకుండా ఏపీఎండీసీకి రిజర్వ్ చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరేందుకు ఏపీ ప్రభుత్వం సిద్ధమవుతోంది. కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇస్తే ఇక్కడి మైన్స్ ద్వారా ఏపీఎండీసీకి ఆర్థికంగా మేలు

## వరి పంటపై తీవ్ర ప్రభావం

-మొదటిపేజీ తరువాయి

నమోదుకావాల్సి ఉండగా 551 మి.మీ మాత్రమే నమోదయ్యే అవకాశం ఉందని వివరించిన అధికారులు. అంచనాలకు మించి ఎల్‌నినో ప్రభావం ఉండబోతుందని తెలిపిన అధికారులు. కృష్ణా, గోదావరి బేసిన్లలో ఎగువ రాష్ట్రాల నుంచి జలాలు వచ్చే అవకాశంపై సీఎం ఆరా. అన్ని జిల్లాల్లోనూ ఎల్‌నినో ప్రభావం చూపిస్తోందని, ఎక్కువగా పశ్చిమ గోదావరి, ప్రకాశం, అన్నమయ్య, కష్ణా, కడప జిల్లాల్లో వర్షాభావ పరిస్థితిలు నెలకొంటాయన్న అధికారులు. 2.78 లక్షల హెక్టార్లలో పత్తి, 1.07 లక్షల హెక్టార్లలో వరిపై ప్రభావం చూపిస్తుందన్న అధికారులు. శ్రీకాకుళం జిల్లా పరిధిలోనే వరి పంటకు ఎక్కువ నష్టం వాటిల్లే అవకాశం ఉందన్న అధికారులు. వంశధార నుంచి జలాలు తరలించి పంటలను కాపాడేలా ప్రయత్నించాలని సూచించిన సీఎం. రాష్ట్రంలో 122 హై రిస్క్ మండలాలను గుర్తించినట్లు తెలిపిన అధికారులు. హై రిస్క్ మండలాల్లో బోరు ఆధారంగా పంటలను కాపాడుకునే అంశాన్ని పరిశీలించాలని సీఎం ఆదేశం. ఆగస్ట్ 3 నుంచి అవగాహన కార్యక్రమాలు, వరికి ప్రత్యామ్నాయ పంటలపై దష్టి, అత్యవసర విత్తన ప్రణాళికను రూపొందించినట్లు తెలిపిన అధికారులు. ఫసల్ బీమా యోజన, వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం కింద ఈ నెల 31వ తేదీ వరకు నమోదు ప్రక్రియ కొనసాగుతుందని వివరించిన అధికారులు. వరి పంటకు ఆగస్ట్ 15 వరకు సమయం ఉందన్న అధికారులు. పశు గ్రాసానికి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టినట్లు వివరించిన అధికారులు. 5 నెలలకు సరిపడా 286.30 లక్షల మెట్రిక్ టన్నుల పశుగ్రాసం అందుబాటులో ఉంచామని వివరించిన అధికారులు. సమీక్షకు హాజరైన వ్యవసాయ, ఉద్యాన, హార్టికల్చర్, పశుసంవర్ధక, ఇరిగేషన్ శాఖల అధికారులు, జూమ్ ద్వారా సమీక్షకు మంత్రి అచ్చెన్నాయుడు హాజరయ్యారు.

## అమరావతిలో జెనోమిక్ సొల్యూషన్ సెంటర్

-మొదటిపేజీ తరువాయి

ఇంటిగ్రేటెడ్ ప్రెసిషన్ అంకాలజీ చికిత్సా విధానాన్ని ప్రారంభించేందుకు ఈ ఎంఓయూ కుదుర్చుకున్నారు. ఊపిరితిత్తులు, రొమ్ము కాన్సర్ రోగుల కోసం అధునాతన జన్యు పరీక్షలు, బయోమార్కర్ టెస్టింగ్ చేసేందుకు వీలుగా ఇంటిగ్రేటెడ్ జెనోమిక్ సొల్యూషన్ సెంటర్‌ను ఆస్ట్రా జెనెకా ఏర్పాటు చేయనుంది. అమరావతి క్వాంటం వ్యాలీ-- ఆస్ట్రా జెనెకా ఇండియా భాగస్వామ్యంతో ఇంటిగ్రేటెడ్ ప్రెసిషన్ అంకాలజీ చికిత్సా విధానాన్ని ప్రారంభించనున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ , నెక్సట్ జనరేషన్ సీక్వెన్సింగ్ , ఆధునిక జన్యుచికిత్సా విధానాల్ని వినియోగించి కాన్సర్ ప్రారంభదశలోనే గుర్తించి శరీర తత్వానికి అనుగుణంగా చికిత్స అందించేలా ఈ ఇంటిగ్రేటెడ్ ప్రెసిషన్ అంకాలజీ విధానం ఉపకరించనుంది. ఊపిరితిత్తుల కాన్సర్ ను ముందుగా గుర్తించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తో కూడిన ఎక్స్ రే ఆధారిత వ్యవస్థను ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఏర్పాటు చేయనుంది. తద్వారా రోగులను వేగంగా స్క్రీనింగ్, డయాగ్నోస్టిక్ సేవలు అందటం తో పాటు ఎలాంటి జాప్యం లేకుండా చికిత్స చేసేందుకు వీలుగా మార్గం సుగమం కానుంది. ప్రజలందరికీ అందుబాటులో అత్యాధునిక వైద్య సదుపాయాలను తీసుకురావటమే ఈ ఒప్పందం లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీఎస్ జి.సాయి ప్రసాద్, ఆస్ట్రాజెనెకా ఇండియా ఎండీ ఏ. ప్రవీణ్ రావు , స్ట్రాండ్ లైఫ్ సైన్సెస్, క్యూర్ ఏఐ సంస్థల ప్రతినిధులు, వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## పనుల్లో నాసిరకం.. బిల్లులు నిలిపివేయండి

**అమరావతి :** పెదపెంకి అభివృద్ధి పనుల్లో నాణ్యతా లోపాలపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ విషయమై నివేదిక ఇవ్వాలని క్వాలిటీ కంట్రోల్ అధికారులను ఆదేశించారు. సంబంధిత రోడ్ల బిల్లులు నిలిపివేయాలని ఆదేశించిన ఉప ముఖ్యమంత్రి పెదపెంకిలో అభివద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచన. పార్వతీపురం మన్యం జిల్లా పరిధిలోని పెదపెంకి గ్రామంలో చేపట్టిన అభివద్ధి పనుల్లో నాణ్యతా లోపాలపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తీవ్రంగా స్పందించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించని కాంట్రాక్టర్‌పై తక్షణం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సంబంధిత పనుల బిల్లులను వెంటనే నిలిపివేయాలని జిల్లా కలెక్టర్‌తోపాటు సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పెదపెంకి గ్రామంలో నిర్మించిన కొన్ని సిమెంట్ రోడ్లలో పగుళ్లు ఏర్పడిన విషయం ఆయన దష్టికి వచ్చింది. ఈ అంశంపై రాష్ట్ర స్థాయి చీఫ్ క్వాలిటీ కంట్రోల్ అధికారిని పెదపెంకి గ్రామానికి పంపించి క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. తనిఖీల్లో ఐదు సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యతా లోపాలు ఉన్నట్లు వెల్లడైంది. క్వాలిటీ కంట్రోల్ అధికారులు సమర్పించిన నివేదిక ఆధారంగా సంబంధిత కాంట్రాక్టర్‌పై చర్యలు చేపట్టాలని శ్రీ పవన్ కళ్యాణ్ గారు ఆదేశించారు. ఈ సందర్భంగా పెదపెంకిలో జరుగుతున్న అభివద్ధి పనుల పురోగతిపై పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్‌తో పాటు పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం అధికారులతో సమీక్ష నిర్వహించారు. పెదపెంకిలో చేపట్టిన రోడ్లు, మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన మౌలిక సదుపాయాలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని, ప్రతి అభివద్ధి పనిలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు.

## రూ.2000 కోట్ల విలువైన భూమిని జప్తు నుంచి కాపాడుతాం

**అమరావతి :** విశాఖపట్నం జిల్లా గాజువాక నియోజకవర్గంలో దాదాపు రూ.2000 కోట్లు విలువ చేసే 174.43 ఎకరాల భూమిని బ్యాంకుల జప్తు నుంచి కాపాడేందుకు కషి చేస్తామని ఉప సభాపతి మరియు అసెంబ్లీ ఫిర్యాదుల కమిటీ చైర్మన్ కె.రఘు రామకష్ణ రాజు వెల్లడించారు. మంగళవారం అసెంబ్లీ కమిటీ హాల్లో ఆయన అధ్యక్షతన ఫిర్యాదుల కమిటీ సమావేశం జరిగింది.అనంతరం అసెంబ్లీ భవనంలోని ఆయన చాంబరులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఉప సభాపతి రఘురామ కష్ణ రాజు మాట్లాడుతూ ఏపీ రిఫ్రాక్టరీస్ సంస్థ పరిశ్రమ నెలకొల్పేందుకు 1981లో రాష్ట్ర ప్రభుత్వం 174.43 ఎకరాల భూమిని కేటాయించగా చేయగా ఆ సంస్థ దివాలా తీయడంతో ప్రస్తుతం ఆ భూమి జప్తునకు గురయ్యే ప్రమాదం ఏర్పడిందన్నారు.ఏపి రిఫ్రాక్టరీస్ సంస్థ భూములు మరియు విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ఆర్--కార్డులు(రీహాబిలిటేషన్ కార్డులు) అంశాలపై అసెంబ్లీ కమిటీ హాల్లో జరిగిన ఫిర్యాదుల కమిటీ సమావేశంలో సభ్యులందరితో కలిసి చర్చించామని పేర్కొన్నారు .దీనిపై ఆగస్టు మొదటి వారంలో ఉన్నతాధికారులు,బ్యాంకర్లతో మరోసారి ఫిర్యాదుల కమిటీ సమావేశం నిర్వహించి సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నం చేస్తామనన్నారు. ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు,కొణతాల



రామకష్ణ,గురజాల జగన్ మోహన్,విష్ణు కుమార్ రాజు తో కలిసి అసెంబ్లీ భవనంలోని ఆయన చాంబరులో మీడియా నిర్వహించారు. ఈమీడియా సమావేశంలో అసెంబ్లీ ఫిర్యాదుల కమిటీ సభ్యులు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏపీ రిఫ్రాక్టరీస్ సంస్థ దివాలా తీయడంతో జాతీయ రహదారి--16 కి ఆనుకుని ఉన్న విలువైన భూములు కోల్పోయే ప్రమాదం ఏర్పడిందన్నారు.పరిశ్రమల ఏర్పాటు కోసం ఇచ్చిన భూమిని జప్తు చేసుకునేందుకు చేపడుతున్న ప్రక్రియపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నామన్నారు.అదే విధంగా స్టీల్ ప్లాంట్ కు భూములిచ్చిన వారి పునరావాసం కోసం ఇచ్చిన ఆర్--కార్డులకు సంబంధించి 1203 మందికి రెగ్యులరైజేషన్ పెండింగ్ లో ఉంచారని వారందరినీ రెగ్యులరైజ్ చేయాలని కోరుతున్నామని శ్రీనివాసరావు చెప్పారు. ఇంకా ఈసమావేశంలో కమిటీ సభ్యులు మరియు శాసన సభ్యులు కొణతాల రామకష్ణ, గురజాల జగన్ మోహన్,విష్ణు కుమార్ రాజు పాల్గొన్నారు. ఆ భూమి జప్తునకు గురయ్యే ప్రమాదం ఏర్పడిందన్నారు.ఏపి రిఫ్రాక్టరీస్ సంస్థ భూములు మరియు విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ఆర్--కార్డులు(రీహాబిలిటేషన్ కార్డులు) అంశాలపై అసెంబ్లీ కమిటీ హాల్లో జరిగిన ఫిర్యాదుల కమిటీ సమావేశంలో సభ్యులందరితో కలిసి చర్చించామని పేర్కొన్నారు .దీనిపై ఆగస్టు మొదటి వారంలో ఉన్నతాధికారులు,బ్యాంకర్లతో మరోసారి ఫిర్యాదుల కమిటీ సమావేశం నిర్వహించి సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నం చేస్తామనన్నారు. ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు,కొణతాల రామకష్ణ,గురజాల జగన్ మోహన్,విష్ణు కుమార్ రాజు తో కలిసి అసెంబ్లీ భవనంలోని ఆయన చాంబరులో మీడియా నిర్వహించారు. ఈమీడియా సమావేశంలో అసెంబ్లీ ఫిర్యాదుల కమిటీ సభ్యులు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏపీ రిఫ్రాక్టరీస్ సంస్థ దివాలా తీయడంతో జాతీయ రహదారి--16 కి ఆనుకుని ఉన్న విలువైన భూములు కోల్పోయే ప్రమాదం ఏర్పడిందన్నారు.పరిశ్రమల ఏర్పాటు కోసం ఇచ్చిన భూమిని జప్తు చేసుకునేందుకు చేపడుతున్న ప్రక్రియపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నామన్నారు.అదే విధంగా స్టీల్ ప్లాంట్ కు భూములిచ్చిన వారి పునరావాసం కోసం ఇచ్చిన ఆర్--కార్డులకు సంబంధించి 1203 మందికి రెగ్యులరైజేషన్ పెండింగ్ లో ఉంచారని వారందరినీ రెగ్యులరైజ్ చేయాలని కోరుతున్నామని శ్రీనివాసరావు చెప్పారు. ఇంకా ఈసమావేశంలో కమిటీ సభ్యులు మరియు శాసన సభ్యులు కొణతాల రామకష్ణ, గురజాల జగన్ మోహన్,విష్ణు కుమార్ రాజు పాల్గొన్నారు.

# పంట నమోదు చేయిస్తేనే ప్రభుత్వ పథకాలు

**- ఎర్రబల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం**
**- మండల వ్యవసాయ అధికారి వి.చెన్నా రెడ్డి**





పులివెందుల అర్బన్ కదిలించే వార్త జులై 28:

రైతులందరూ తమ పంట వివరాలను తప్పనిసరిగా నమోదు (ఈ-పంట) చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి వి.చెన్నా రెడ్డి స్పష్టం చేశారు. పులివెందుల మండల పరిధిలోని ఎర్రబల్లి-2 రైతు సేవా కేంద్రంలో ఆయన అధ్యక్షతన పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.?ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ శాఖ ద్వారా అమలు చేసే ప్రభుత్వ సంక్షేమ పథకాలు, లబ్ధి పొందాలంటే ప్రతి రైతు తమ పంటను నమోదు చేయించుకోవడం బాధ్యతగా భావించాలని తెలిపారు. ఖరీఫ్‌లో సాగు చేసిన ప్రతి ఒక్క పంట వివరాలను ఆర్బీకే (రైతు సేవా కేంద్రం) సిబ్బందిని సంప్రదించి నమోదు చేసుకోవాలని కోరారు.పులివెందుల మండలంలో ఈ ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటివరకు 5,069 ఎకరాలలో పంట నమోదు పూర్తయిందని ఎంఏఓ వెల్లడించారు. అందులో ప్రధానంగా అరటి 2,919 ఎకరాలు,బత్తాయి 1,845 ఎకరాలు,?పత్తి 265 ఎకరాలు,?వేరుశనగ 40 ఎకరాలు నమోదు చేయించుకున్నారని,?ఇప్పటివరకు పంట నమోదు చేయించుకోని రైతులు వెంటనే సంబంధిత రైతు సేవా కేంద్రం సిబ్బందిని కలిసి నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని ఆయన సూచించారు.పంట బీమా (క్రాప్ ఇన్సూరెన్స్) ప్రీమియం చెల్లించే గడువును ఈ నెల 31వ తేదీ వరకు పొడిగించినట్లు చెన్నా రెడ్డి తెలిపారు.ఈ అవకాశాన్ని మండలంలోని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.?ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి భార్గవ్ రెడ్డి, రైతు సేవా కేంద్రం సిబ్బంది మరియు స్థానిక రైతులు పాల్గొన్నారు.

# వేంపల్లె గ్రంథాలయంపై జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఆకస్మిక తనిఖీ

**- పోటీ పరీక్షల పుస్తకాలు అందుబాటులోకి తెస్తాం -- నిరుద్యోగ యువతకు ఉపయోగపడేలా చర్యలు**

**- దాసరి భాను ప్రకాష్**



వేంపల్లె (కదిలించే వార్త)జూలై 28:

వేంపల్లె ప్రభుత్వ గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దాసరి భాను ప్రకాష్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రంథాలయంలోని రికార్డులు, పుస్తకాల నిర్వహణ, పరిసరాల పరిశుభ్రతను క్షుణ్ణంగా పరిశీలించిన ఆయన నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా నాయకురాలు సుష్మ, స్థానిక బీజేపీ నాయకులతో కలిసి గ్రంథాలయాన్ని సందర్శించి, త్వరలో నిర్వహించనున్న డీఎస్సీ, ఏపీ ట్రాన్స్‌కోతో పాటు ఇతర ప్రభుత్వ పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలను గ్రంథాలయంలో అందుబాటులో ఉంచాలని విజ్ఞప్తి చేశారు. దీంతో గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు.దీనిపై స్పందించిన జిల్లా గ్రంథాలయ చైర్మన్ దాసరి భాను ప్రకాష్, పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాల కొనుగోలుపై ఉన్నతాధికారులతో చర్చించి త్వరలోనే తగిన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.అలాగే విద్యార్థులు, ఉద్యోగార్థులు, విశ్రాంత ఉద్యోగులు, జ్యేష్ఠ పౌరులు గ్రంథాలయ సభ్యత్వాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. కేవలం రూ.100 జీవితకాల సభ్యత్వ రుసుము చెల్లించి సభ్యత్వం పొందితే, జీవితాంతం గ్రంథాలయం నుంచి పుస్తకాలను ఇంటికి తీసుకెళ్లి చదివి తిరిగి అప్పగించే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవడంతో పాటు గ్రంథాలయ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు.ఈ తనిఖీ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి టి. వనజకుమారి, బీజేపీ జిల్లా వాణిజ్య సెల్ అధ్యక్షుడు దొంతు సుమన్, వృషభాచలేశ్వర ఆలయ కమిటీ సభ్యుడు సునీల్ కుమార్, ఐటీ సెల్ కన్వీనర్ ప్రసాద్ రెడ్డి, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ క్రీడల్లో ఏపీ క్రీడాకారుల సత్తా

**- బ్యాడ్మింటన్, కబడ్డీలో బంగారు పతకాలు -- ఫుట్‌బాల్‌లో కాంస్యం**






వేంపల్లె (కదిలించే వార్త)జులై 28:

ఇండియా కౌన్సిల్ ఫర్ స్పోర్ట్స్ అండ్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో జమ్ము తావి (జమ్ము & కాశ్మీర్)లో జూలై 24 నుంచి 26 వరకు నిర్వహించిన జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో ఆంధ్రప్రదేశ్ కౌన్సిల్ ఫర్ స్పోర్ట్స్ అండ్ ఎడ్యుకేషన్ తరఫున పాల్గొన్న రాష్ట్ర క్రీడాకారులు అద్భుత ప్రతిభ కనబర్చి పలు విభాగాల్లో పతకాలు సాధించారు.బ్యాడ్మింటన్ సీనియర్ పురుషుల డబుల్స్ విభాగంలో తేజేంద్ర--హరిప్రసాద్ జోడీ ప్రథమ స్థానం సాధించి బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. మహిళల సింగిల్స్‌లో స్నేహితా రెడ్డి విజేతగా నిలవగా, మిక్స్‌డ్ డబుల్స్‌లో హర్షవర్ధన్ రెడ్డి--స్నేహితా రెడ్డి జోడీ స్వర్ణ పతకాన్ని అందుకుంది.అండర్--14 బాలికల బ్యాడ్మింటన్ విభాగంలో సింగిల్స్‌లో దివ్య, డబుల్స్‌లో సునీత--హారిక జోడీ, మిక్స్‌డ్ డబుల్స్‌లో ముక్త--సంజు శ్రీరామ్ జోడీలు ప్రథమ స్థానాలు సాధించి బంగారు పతకాలను గెలుచుకున్నాయి.కబడ్డీ పోటీల్లో భరత్, సంతోష్, జగన్, పవన్, మణిదీప్, తరుణ్, సాయిల్, మోక్షిత్, లక్ష్మి, కిరణ్, గౌస్, కార్తీక్‌లతో కూడిన ఆంధ్రప్రదేశ్ జట్టు అద్భుత ఆటతీరుతో తొలి స్థానంలో నిలిచి స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకుంది.అండర్--14 ఫుట్‌బాల్ విభాగంలో ఏకాంత్, అబ్రార్, చైతన్య, హర్ష, అయాన్, అశ్వత్, అఖిల్‌లతో కూడిన జట్టు మూడో స్థానం సాధించి కాంస్య పతకాన్ని గెలుచుకుంది.ఈ విజయాలతో ఆంధ్రప్రదేశ్ క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాష్ట్ర ప్రతిష్ఠను మరోసారి చాటారని ఆంధ్రప్రదేశ్ కౌన్సిల్ ఫర్ స్పోర్ట్స్ అండ్ ఎడ్యుకేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మురళి, రాష్ట్ర కార్యదర్శి మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. విజేతలైన క్రీడాకారులు, కోచ్‌లకు వారు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయి విజయాలు సాధించి రాష్ట్రానికి, దేశానికి కీర్తి తీసుకురావాలని ఆకాంక్షించారు.

# గురుపౌర్ణమి వేడుకలకు ముస్తాబైన షిరిడి సాయిబాబా ఆలయం

**- అన్నిఏర్పాట్లు పూర్తి**
**- ఆలయ చైర్మన్ శ్రీరామ సుబ్బయ్య**





పులివెందుల కదిలించే వార్త జులై 28



పులివెందుల పట్టణంలోని పార్నపల్లి రోడ్డు సమీపంలోని మొట్టమొదటి షిరిడి సాయిబాబా ఆలయంలో గురు పౌర్ణమి వేడుకలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ చైర్మన్ శ్రీరామ సుబ్బయ్య, ఆలయ ప్రధాన అర్చకుడు మురళి స్వామి లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురు పౌర్ణమి సందర్భంగా తెల్లవారుజామున స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రత్యేక హారతులు ఇవ్వడం జరుగుతుందన్నారు. 101 కలశాలతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. మధ్యాహ్నం 12 గంటల నుండి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. సాయంత్రం నాలుగు గంటల నుండి స్వామివారి గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు వారి తెలిపారు. గ్రామ సభలో చెక్కభజన కార్యక్రమం, తాళాల భజన కార్యక్రమం ఉంటుందన్నారు. గురు పౌర్ణమి సందర్భంగా ప్రతి ఒక్కరూ శిరిడి సాయిబాబాను దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకోవాలని వారు పిలుపునిచ్చారు.



# గురు పౌర్ణమి సందర్భంగా శ్రీ చైతన్య హైస్కూల్‌లో రెండు రోజుల ఆధ్యాత్మిక విద్యా శిక్షణ

**- విద్యార్థుల్లో నైతిక విలువలు, ఏకాగ్రత, వ్యక్తిత్వ వికాసమే లక్ష్యం**

వేంపల్లె (కదిలించే వార్త) జూలై 28 :

గురు పౌర్ణమి సందర్భంగా వేంపల్లిలోని శ్రీ చైతన్య హైస్కూల్‌లో జూలై 29, 30 తేదీల్లో రెండు రోజులపాటు ఆధ్యాత్మిక విద్యా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పాఠశాల యాజమాన్యం వెల్లడించింది. ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు.విద్యార్థుల్లో నైతిక విలువలు, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, సానుకూల ఆలోచనా విధానం, సేవా దృక్పథాన్ని పెంపొందించడమే ఈ శిక్షణ ప్రధాన ఉద్దేశమని యాజమాన్యం తెలిపింది. విద్యతో పాటు ఆధ్యాత్మిక జ్ఞానం, మానవీయ విలువలు కూడా విద్యార్థుల సంపూర్ణ వ్యక్తిత్వ వికాసానికి అత్యంత అవసరమని పేర్కొంది.శిక్షణలో ధ్యానం ప్రాముఖ్యత, మనస్సును ప్రశాంతంగా ఉంచుకునే విధానాలు, చదువుపై ఏకాగ్రత పెంపొందించడం, సమయపాలన, మంచి అలవాట్లు, తల్లిదండ్రులు--గురువుల పట్ల గౌరవం, సమాజం పట్ల బాధ్యత వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించనున్నారు. అలాగే పరీక్షల ఒత్తిడిని అధిగమించి, స్పష్టమైన లక్ష్యాలతో ముందుకు సాగేలా అవసరమైన సూచనలు అందించనున్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా బ్యాంక్ ఆఫ్ బరోడా రిటైర్డ్ సీనియర్ మేనేజర్, పిరమిడ్ జ్ఞాన పీఠాల మేనేజింగ్ ట్రస్టీ శ్రీ కె. శ్రీనివాసరావు హాజరై, ధ్యానం, నైతిక విలువలు, స్వీయ అవగాహన, ఉత్తమ వ్యక్తిత్వ నిర్మాణంపై విద్యార్థులకు మార్గనిర్దేశం చేయనున్నారు.ఈ రెండు రోజుల ఆధ్యాత్మిక విద్యా శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని, విద్యా ప్రగతితో పాటు ఉత్తమ వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవాలని శ్రీ చైతన్య హైస్కూల్ యాజమాన్యం విజ్ఞప్తి చేసింది.

# డీఎస్సీ నియామకాల్లో అవకతవకలపై సీబీఐతో సమగ్ర విచారణ జరిపించాలి

**.....జిల్లా విద్య విభాగ జిల్లా ప్రధాన కార్యదర్శి మంచాల శ్యామ్**



కమలాపురం కదిలించే వార్త జూలై 28

డీఎస్సీ నియామకాల్లో చోటుచేసుకున్న అవకతవకలపై సీబీఐతో సమగ్ర విచారణ జరిపించాలని జిల్లా విద్య విభాగ జిల్లా ప్రధాన కార్యదర్శి మంచాల శ్యామ్ అన్నారు.కడప వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి పోస్ట్ ఆఫీస్ వరకు స్టూడెంట్ లతో కలిసి ర్యాలీగా బయలుదేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూడీఎస్సీ అక్రమాలకు నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెంటనే  రాజీనామా చేయాలని అన్నారు అలాగే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం మరియు యువజన విభాగం ఆధ్వర్యంలో జరిగిన నిరసన ర్యాలీలో కడప నియోజకవర్గం విద్యార్థి విభాగం పాల్గొన్నందుకు ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు. ఆయన తెలిపారు.

# వరల్డ్ హెపటైటిస్ డే అవగాహన కార్యక్రమం

**- సిహెచ్సి ఇంచార్జ్ డాక్టర్  శిరీష**





కమలాపురం కదిలించే వార్త జూలై 28వరల్డ్ హెపటైటిస్ డే-2026 సందర్భంగా కమలాపురంలో నగర సిహెచ్సి ఇంచార్జ్ డాక్టర్ శిరీష ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలోవరల్డ్ హెపటైటిస్ డే-2026 సందర్భంగా "హెపటైటిస్: అడ్డంకులను తొలగిద్దాం అనే ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ ) థీమ్‌కు అనుగుణంగా సీహెచ్సీ కమలాపురంలో హెపటైటిస్ వ్యాధిపై విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. అవగాహన కార్యక్రమంలో డాక్టర్లు ప్రజలకు హెపటైటిస్ అంటే ఏమిటి, హెపటైటిస్ రకాలు (ఎ, బి, సి, డి, ఈ), వ్యాధి వ్యాపించే మార్గాలు, లక్షణాలు, వ్యాధిని నిర్ధారించే పరీక్షలు, అందుబాటులో ఉన్న చికిత్సా విధానాలు, హెపటైటిస్-బి టీకా ప్రాముఖ్యత గురించి వైద్యులు వివరించారు.అదేవిధంగా, వైద్యుల సలహా లేకుండా నాటుమందులు లేదా శాస్త్రీయ ఆధారాలు లేని ఇతర ప్రత్యామ్నాయ మందులను వాడటం వల్ల కాలేయానికి తీవ్రమైన హాని కలిగే అవకాశం ఉందని ప్రజలకు అవగాహన కల్పించారు. హెపటైటిస్‌పై ఉన్న అపోహలు, భయం, వివక్షను తొలగిస్తూ, సకాలంలో పరీక్షలు చేయించుకోవడం, అవసరమైన చికిత్స తీసుకోవడం, వైద్యుల సూచనలు పాటించడం ద్వారా ఈ వ్యాధిని నియంత్రించవచ్చని వివరించారు.ఈ సందర్భంగా ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆసుపత్రి నర్సింగ్ సిబ్బంది, ఆసుపత్రి శానిటేషన్ వర్కర్లు, మున్సిపల్ శానిటేషన్ వర్కర్లు, వైద్యులు మరియు ఇతర ఆరోగ్య సిబ్బందికి హెపటైటిస్-బి మరియు హెపటైటిస్-సి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు.పరీక్ష చేయించుకోండి మీ కాలేయాన్ని రక్షించుకోండి అనే సందేశంతో ప్రజల్లో అవగాహన పెంపొందిస్తూ, ప్రతి ఒక్కరికీ పరీక్షలు, టీకాలు, చికిత్స మరియు సంరక్షణ అందుబాటులో ఉండేలా కృషి చేయాలని, 2030 నాటికి హెపటైటిస్‌ను ప్రజారోగ్య సమస్యగా నిర్మూలించేందుకు అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజలు డాక్టర్ తాజుద్దీన్ బాషా, డాక్టర్ బస్వంత్ రెడ్డి, డాక్టర్ శిల్ప మరియు ఇతర వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, శానిటేషన్ సిబ్బంది ఇతర ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# వేంపల్లె లో వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

**- నిర్వాహకుడితో పాటు ముగ్గురు విటుల అరెస్ట్ను రూ.16,070 నగదు, 6 కాండోమ్‌లు స్వాధీనం**

వేంపల్లె (కదిలించే వార్త)జూలై 28 : వేంపల్లె పట్టణంలోని చింతారాంపల్లి సమీప జగనన్న కాలనీలో రహస్యంగా నిర్వహిస్తున్న వ్యభిచార గృహంపై పోలీసులు మంగళవారం మెరుపు దాడి నిర్వహించారు. పక్కా సమాచారంతో వేంపల్లి అర్బన్ పోలీస్ స్టేషన్ సీఐ టి. నరసింహులు, ఎస్ఐ ఇ. తిరుపాల్ నాయక్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం దాడి చేసి నిర్వాహకుడితో పాటు ముగ్గురు విటులను అరెస్టు చేశారు.పోలీసుల కథనం ప్రకారం, వ్యభిచారం జరుగుతున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు దాడి నిర్వహించగా, ఘటనాస్థలంలో నిర్వాహకుడితో పాటు ముగ్గురు విటులు పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి రూ.16,070 నగదుతో పాటు 6 కాండోమ్‌లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.అరెస్టయిన వారిలో గజ్జల చెన్నకృష్ణారెడ్డి (74) (నిర్వాహకుడు), నామా హరి (35), కల్లూరు మల్లికార్జున రెడ్డి (40), సాగవాని కార్తీక్ కుమార్ (29) ఉన్నారు. నిందితులపై అనైతిక రవాణా (నిరోధక) చట్టం మరియు సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ, వేంపల్లి పరిసర ప్రాంతాల్లో ఎవరైనా చట్టవిరుద్ధంగా వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని, ప్రజలు చట్టవ్యతిరేక కార్యకలాపాల నిర్మూలనలో పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# శ్యామ్ నందన్ కు క్రౌడ్ ఫండ్ పులివెందుల ప్రజలు లక్ష రూపాయలు

## - అభినందనలు తెలిపిన కాలేజీ ప్రిన్సిపాల్ చంద్ర ప్రసాద్ రెడ్డి

పులివెందుల కదిలించే వార్త అర్బన్ జులై 28

శ్యామ్ నందన్ కు ఎస్,ఎం, ఏ టైప్ వన్ వ్యాధి రావడంతో ఆ వ్యాధికి ఇంజక్షన్ 16 కోట్ల రూపాయలు ఖర్చువుతుందని డాక్టర్లు చెప్పడంతో వారి తల్లిదండ్రులు దిక్కు దోచని పరిస్థితిలో ఆర్థిక సాయాన్ని కోరారు. ఈ విషయాన్ని తెలుసుకున్న పులివెందుల తపస్య జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్ చంద్ర ప్రసాద్ రెడ్డి, పులివెందుల హరి యూట్యూబ్ ఛానల్, పులివెందుల యూట్యూబ్ ఛానల్ వారి ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో విద్యార్థిని, విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి పండు కలెక్ట్ చేశారు. ఈ కలెక్షన్లో 70 వేల రూపాయలు క్యాష్ 30 వేల రూపాయలు ఫోన్పే ద్వారా మొత్తం లక్ష రూపాయలు వచ్చిందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పులివెందుల ప్రజలు ఇంతగా ఆదరిస్తారని నేను అనుకోలేదన్నారు. ఒకే రోజులోనే లక్ష రూపాయలు విరాళం అందజేసిన పులివెందుల ప్రజలకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలుపుతున్న అన్నారు. ఇంకా ఎవరైనా ఆర్థిక సాయం అందించాలనుకున్నవారు 9739940430 ఈ నెంబర్కు ఫోన్ పే చేయాలన్నారు. పులివెందుల ప్రజల రుణం తీర్చుకోలేనిది అన్నారు. మీరు ఇచ్చే ప్రతి రూపాయి శ్యామ్ నందన్ కాపాడే దానికి ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పులివెందుల హరి యూట్యూబ్ ఛానల్ వారు, విద్యార్థినిలు పాల్గొన్నారు.



# దేశ భవిష్యత్ యువతదే -- మత్తు రహిత సమాజం కోసం విద్యార్థుల కదం!

## - డాక్టర్ హర్ష వర్ధన్ రెడ్డి , నాగేశ్వర్ రెడ్డి

## - మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా కదం తొక్కిన లయోలా పాలిటెక్నికల్ కళాశాల విద్యార్థులు



పులివెందుల కదిలించే వార్త జులై 28

పులివెందుల పట్టణంలోని స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు ఆధ్వర్యంలో, లయోలా పాలిటెక్నికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఫాదర్ బ్రిట్టో అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన మాదక ద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమం విజయవంతంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ దినేష్ మెడికల్ సెంటర్ వైద్యులు డాక్టర్ హర్షవర్ధన్ రెడ్డి, ప్రముఖ వ్యాఖ్యాత నాగేశ్వర్ రెడ్డి పాల్గొని విద్యార్థులకు మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, సమాజంలో గౌరవం-మర్యాదలపై వాటి ప్రభావం, అలాగే ఆర్థిక, సామాజిక పరంగా కలిగే నష్టాలను వివరించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి తమ లక్ష్యాల సాధనకు కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా కళాశాల కరెస్పాండెంట్ ఫాదర్ ప్రభుదాస్, ప్రిన్సిపాల్ ఫాదర్ బ్రిట్టో, వైస్ ప్రిన్సిపాల్ ప్రవీణ్ మాట్లాడుతూ యువత తమ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. మత్తు



రహిత సమాజ నిర్మాణంలో ప్రతి విద్యార్థి భాగస్వామి కావాలని వారు పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులు మాదక ద్రవ్యాల నిర్మూలన లక్ష్యంగా భారీ అవగాహన ర్యాలీ నిర్వహించి యువతకు ఆదర్శంగా నిలిచారు. "దేశ భవిష్యత్ యువతదే", "యువత మేలుకో -- మత్తు జోలికి వెళ్లొద్దు", "మత్తు వద్దు -- ఉజ్వల భవిష్యత్ ముద్దు" అనే నినాదాలతో పట్టణ వీధుల్లో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు.మాదక ద్రవ్యాలు యువత జీవితాలను నాశనం చేయడంతో పాటు కుటుంబాలు, సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతాయని విద్యార్థులు ప్రజలకు వివరించారు. ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, ఆరోగ్యకరమైన మరియు బాధ్యతాయుతమైన జీవితాన్ని గడపాలని సందేశం అందించారు. భారీ సంఖ్యలో విద్యార్థులు పాల్గొనడంతో ర్యాలీ విజయవంతమైంది."మత్తుకు నో చెప్పండి -- భవిష్యత్తుకు అవును చెప్పండి" అనే నినాదంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రజల నుండి విశేష స్పందన లభించింది.ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం, స్నేహిత అమృత హస్తం సేవాసమితి సభ్యులు, రాఘవేంద్ర రెడ్డి నేత్ర సేకరణ కేంద్రం టెక్నీషియన్ అరవింద్ మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# 26 నెలలలో పులివెందులలో ఏమి అభివృద్ధి చేశారని ఇంటింటికి టిడిపి నాయకులు వెళ్తున్నారు

## - అభివృద్ధి పై ప్రజలు నిలదీస్తే ఏమి సమాధానం చెప్తారు

## - పులివెందుల అభివృద్ధి చెందిందంటే అది వైఎస్ కుటుంబమే చలువే

## వైకాపా నాయకులు

పులివెందుల కదిలించే వార్త జులై 28

26 నెలలలో పులివెందులలో టిడిపి నాయకులు ఏమి అభివృద్ధి చేశారని ఇంటింటికి ప్రచారం వెళుతున్నారని, అభివృద్ధిపై ప్రజలు నిలదీస్తే ఏమి సమాధానం చెప్తారని, పులివెందుల అభివృద్ధి చెందింది అంటే అది ఒక వైఎస్ కుటుంబంతోనే అని వైకాపా నాయకులు కొంగనపల్లె మురళి, గుడ్ల సంపత్, లు అన్నారు. మంగళవారం జగన్ క్యాంప్ కార్యాలయంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందన్నారు. నిరుద్యోగులు నిరుద్యోగ భృతి కోసం ఎదురుచూస్తున్నారన్నారు. పులివెందులలో రాష్ట్రంలో ఎక్కడలేని విధంగా డ్రైనేజీ వ్యవస్థ పులివెందులలో ఉందన్నారు. 50 ఏళ్లకు ఎస్సీ ,ఎస్టీ ,బీసీ, మైనార్టీలకు పెన్షన్ ఇస్తామని చెప్పి ఇంతవరకు ఆ ఊసే లేదన్నారు. ఫీజు రియింబర్స్మెంట్ పథకం వుసే లేదన్నారు. దీనివల్ల విద్యార్థులు ఫీజు కట్టలేక ఎంతో మానసిక శోభకు గురవుతున్నారు అన్నారు. 23వ వార్డులో కొత్తగా చేరినటిడిపి నాయకులు కిషోర్ అభివృద్ధి గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. 23వ వార్డులో మీ అబ్బ వార్డ్ మెంబర్ గా ఉండి సిమెంట్ రోడ్లు వేయించినది నీకు కనిపించలేదన్నారు. వైకాపా ప్రభుత్వంలో 23 వ వార్డు కౌన్సిలర్ మీ చిన్నాన్న కొండలరావు కరోనాతో కొట్టుమిట్టాడుతూ ఉంటే వైఎస్ కుటుంబం సహాయం చేయలేదని వారు ప్రశ్నించారు. అభివృద్ధిలో భాగంగా రోడ్ల విస్తరణలో 23 లక్షల రూపాయలు మీకు నష్టపరిహారం అనింది



వాస్తవం కాదాన్ని ప్రశ్నించారు. 23 వార్డులో ఇంటింటికి వెళ్లి మీరు మొసలి కన్నీరు కార్చిన 23 వ వార్డు ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందన్న నీకు అండర్ డ్రైనేజి గురించి తెలుసా అని వారు ప్రశ్నించారు. జగనన్న ప్రభుత్వంలో ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందాయన్నారు. మీ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ఇంటింటికి ప్రచారం ఏ విధంగా చేస్తారని వారన్నారు. పులివెందులకు జగన్ మోహన్ రెడ్డి మెడికల్ కాలేజీ తెప్పిస్తే, కూటమి ప్రభుత్వం ఆ మెడికల్ షీట్లను వెనక్కి పంపించిన ఘనత మీదే అన్నారు. ఇప్పటికైనా పులివెందుల అభివృద్ధి చేసి చూపించి ప్రజల వద్దకు వెళ్లాలని వారు హితవుపలికారు.

# జిల్లా క్రీడా అభివృద్ధి సంస్థ, తిరుపతి ఎమ్మెల్యే శ్రీనివాసులు

తిరుపతి రూరల్ కదిలించే వార్త 28 జూలై

తిరుపతిలో అమరావతి ఛాంపియన్‌షిప్--2026 నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలకు ఘన ప్రారంభంఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అమరావతి ఛాంపియన్‌షిప్2026 నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు 28.07.2026న తిరుపతి జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో ఘనంగా ప్రారంభమయ్యాయి.ఈ కార్యక్రమానికి ముఖ్య తిథులుగా ఆరణి శ్రీనివాసులు, ఎమ్మెల్యే, నరసింహ యాదవ్, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్, శ్రీధర్ వర్మ , మాజీ సాప్ బోర్డు సభ్యులు పాల్గొని పోటీలను ప్రారంభించారు.ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అమరావతి ఛాంపియన్‌షిప్.2026 క్రీడా పోటీలు గ్రామీణ స్థాయి నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలికితీసి వారికి మరింత ప్రోత్సాహాన్ని అందించే వేదికగా నిలుస్తాయని పేర్కొన్నారు. క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.ఈ రోజు 28.07.2026 తిరుపతి జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో నిర్వహించిన పోటీలలో సుమారు 2,500 మంది క్రీడాకారులు, కోచ్‌లు, పీడీలు ాణలు, పీఈటీలు ాజులు మరియు వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.క్రీడాకారులకు మధ్యాహ్న భోజనాన్ని మెడ్డే మీల్స్ ద్వారా ఏర్పాటు చేసి అందించడం జరిగింది.మొదటి రోజు 28.07.2026 యోగ, వాలీబాల్, ఖో-ఖో, కబడ్డీ, చెస్ మరియు బాస్కెట్‌బాల్ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించబడ్డాయి. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనే అర్హత సాధించారు.

29.07.2026 న హాకీ, ఆర్చరీ, అథ్లెటిక్స్, బాక్సింగ్, వెయిట్‌లిఫ్టింగ్ మరియు బ్యాడ్మింటన్ క్రీడాంశాల పోటీలు రేపు 29.07.2026 న నిర్వహించబడనున్నాయి.

పోటీలు నిర్వహించారు

1తిరుపతి నియోజకవర్గంశ్రీ శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ మరియు ఎస్.వి. స్టేడియం, తిరుపతి.

2చంద్రగిరి నియోజకవర్గం -- ఎన్‌ఆర్‌ఎన్ కేవీకే స్టేడియం మరియు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, చంద్రగిరి.

3గూడూరు నియోజకవర్గం -- ఏఏఎస్‌ఆర్ స్టేడియం, గూడూరు సబ్ సెంటర్, గూడూరు.

4సూళ్లూరుపేట నియోజకవర్గం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం, సూళ్లూరుపేట.



5 వెంకటగిరి నియోజకవర్గం -- ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానం, వెంకటగిరి.

6 శ్రీకాళహస్తి నియోజకవర్గం -- ఎన్‌టీఆర్ కేవీకే మరియు జెడ్‌పీ బాలుర ఉన్నత పాఠశాల, శ్రీకాళహస్తి.

7సత్యవేడు నియోజకవర్గం -- ఎన్‌టీఆర్ కేవీకే స్టేడియం మరియు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సత్యవేడు.

ఆయా క్రీడాంశాల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారుల వివరాలను త్వరలో అధికారికంగా ప్రకటించనున్నట్లు జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి ఎన్. శశిధర్ తెలిపారు.

# గండి ఆంజనేయస్వామి హుండీకి రూ.36.38 లక్షల ఆదాయం

## - 68 రోజుల్లో భక్తుల భారీ కానుకలు -- బంగారం, వెండి, విదేశీ కరెన్సీ సమర్పణ





గండి(కదిలించే వార్త)జూలై 28 :

రాయలసీమలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన గండి శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానంలో మంగళవారం నిర్వహించిన హుండీల లెక్కింపులో గత 68 రోజులుగా భక్తులు సమర్పించిన కానుకల ద్వారా రూ. 36,38,630 ఆదాయం వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి సి. నిత్యనాథ్ వెల్లడించారు.ఉదయం 8 గంటలకు ప్రారంభమైన హుండీల లెక్కింపులో సాధారణ హుండీల ద్వారా రూ. 35,90,878, అన్నప్రసాద వితరణ హుండీ ద్వారా రూ. 47,752 నగదు లభించింది. అలాగే 5.190 గ్రాముల బంగారం, 254 గ్రాముల వెండి, 125 అమెరికన్ డాలర్లు (మూడు నోట్లు) భక్తులు సమర్పించినట్లు అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా ఆలయానికి చెందిన సర్వే నంబర్ 1190లోని 0.28 సెంట్ల భూమికి బహిరంగ వేలం నిర్వహించారు. కుమ్మరాంపల్లె గ్రామానికి చెందిన బి. ధర్మారెడ్డి రూ. 1,500కు హెచ్చు పాటదారుగా నిలిచినట్లు వెల్లడించారు.హుండీల లెక్కింపు కార్యక్రమాన్ని కడప జిల్లా దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సి. శివయ్య పర్యవేక్షించగా, ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ ఎస్. నాగరాజు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కల్లూరి వెంకటస్వామి, పాలకమండలి సభ్యులు, ప్రధాన అర్చకులు వి. కేసరి, ఉప ప్రధాన అర్చకులు వి. రాజా రమేష్ స్వాములు, ఏపీజీబీ చక్రాయపేట శాఖ సిబ్బంది, ఆలయ సిబ్బంది, తాత్కాలిక క్షురకులు, భజంత్రీలు పాల్గొన్నారు. హుండీల లెక్కింపును పారదర్శకంగా నిర్వహించినట్లు అధికారులు తెలిపారు.

# ప్రభుత్వ బడులు వెలవెల.. ప్రైవేట్ బడులు కళకళ

## - 972 ప్రభుత్వ పాఠశాలలు మూతపడ్డాయి.. 5.86 లక్షల మంది విద్యార్థులు తగ్గారు


## - డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి



వేంపల్లె (కదిలించే వార్త)జూలై 28:

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలనలో ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు క్రమంగా బలహీనపడుతుండగా, ప్రైవేట్ పాఠశాలలు అభివృద్ధి చెందుతున్నాయని రాజ్యసభ మాజీ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి విమర్శించారు. మంగళవారం వేంపల్లిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేంద్ర విద్యాశాఖ విడుదల చేసిన నివేదికను ప్రస్తావిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. 2023--24 విద్యా సంవత్సరంలో రాష్ట్రంలో 45,991 ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు ఉండగా, 2025--26 నాటికి వాటి సంఖ్య 45,019కు తగ్గిందని, అంటే రెండేళ్లలోనే 972 ప్రభుత్వ పాఠశాలలు మూతపడ్డాయని తెలిపారు. ఇదే కాలంలో ప్రైవేట్ పాఠశాలల సంఖ్య 478 పెరిగిందని పేర్కొన్నారు.అలాగే, 2023--24లో ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో 41,75,600 మంది విద్యార్థులు ఉండగా, 2025--26 నాటికి ఆ సంఖ్య 35,89,160కు తగ్గిందన్నారు. దీంతో 5,86,440 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల నుంచి తగ్గిపోయారని ఆయన పేర్కొన్నారు. మరోవైపు ఇదే కాలంలో ప్రైవేట్ పాఠశాలల్లో 2,86,916 మంది విద్యార్థులు పెరిగారని తెలిపారు.ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో అభివృద్ధి జరిగిందని ప్రచారం చేసుకుంటోందని, మరోవైపు ప్రభుత్వ పాఠశాలలు మూతపడటం, విద్యార్థుల సంఖ్య భారీగా తగ్గడం ఆందోళనకర పరిణామమని తులసి రెడ్డి విమర్శించారు.ప్రభుత్వం స్వయంప్రశంసలు చేసుకోవడం మానుకుని, ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేలా పటిష్టమైన, నిర్మాణాత్మక చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, ఉపాధ్యాయుల నియామకాలు, విద్యా ప్రమాణాల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# నూతన యూజిడి వ్యవస్థకు 188 కోట్లతో ప్రతిపాదనలు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు




తిరుపతి రూరల్ కదిలించే వార్త 28 జూలై తిరుపతిలో నగరాన్ని అన్ని విధాల ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అభివృద్ధి చేస్తోందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం ఉదయం ఒకటవ డివిజన్ లోని సుబ్బారెడ్డి నగర్ లో 27లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రారంభించారు. నగర విస్తరణలో భాగంగా ఏర్పాటైన ప్రాంతాల్లో డ్రైనేజీ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్ పర్సన్ సుగుణమ్మ, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, రాష్ట్ర నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, ఎస్ ఈ శ్యాంసుందర్, ఈఈ తులసి కుమార్ , గోమతి, డీఈ రమణ, ప్రజా ప్రతినిధులు, పాల్గొన్నారు.

# ఎస్వీ ఆయుర్వేద కళాశాల విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది

## మెరుగైన వైద్య సేవలు అందించాం

## చికిత్స అనంతరం విద్యార్థులందరూ డిశ్చార్జ్ టిటిడి జేఈవో డా. ఎ. శరత్



తిరుపతి రూరల్ కదిలించే వార్త 28 జూలై

తిరుపతిలోని ఎస్వీ ఆయుర్వేద కళాశాల బాలురు, బాలికల వసతి గృహాలకు చెందిన కొందరు విద్యార్థులకు స్వల్ప అస్వస్థత లక్షణాలు కనిపించడంతో వెంటనే వైద్య చికిత్స అందించి, వారి ఆరోగ్య పరిస్థితిని పూర్తిగా నిలకడలోకి తీసుకువచ్చినట్లు టిటిడి జేఈవో డా. ఎ. శరత్ తెలిపారు.అస్వస్థతకు గురైన విద్యార్థుల్లో 20 మంది బాలికలు, 8 మంది బాలురు ఉండగా, వారిలో 17 మంది బాలికలు, ముగ్గురు బాలురను అంబులెన్స్ ద్వారా టీటీడీ సెంట్రల్ ఆసుపత్రికి తరలించారు.అనంతరం వారు తిరిగి వసతి గృహాలకు చేరుకుని భోజనం చేశారు. తుది వైద్య నివేదిక ప్రకారం అస్వస్థతకు గురైన విద్యార్థులందరూ ప్రస్తుతం సురక్షితంగా, సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు.

## ఏపీ సచివాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ నుంచి రెవెన్యూ, అటవీ శాఖ, ఎల్ నినో ప్రభావం పై సమీక్ష నిర్వహించిన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్



తిరుపతికలెక్టరేట్ కదిలించే వార్త 28 జూలైతిరుపతి కలెక్టరేట్ కార్యాలయంలో మంగళవారం రాష్ట్రం లోని రెవెన్యూ సమస్యలు, పట్టాదారు పాసు పుస్తకాలు, 22ఏ, రీ సర్వే, మాన్యువల్ రెవెన్యూ రికార్డుల డిజిటలైజేషన్, అటవీ భూములు, వ్యవసాయం పై ఎల్ నినో ప్రభావం తదితర అంశాల పై రాష్ట్ర సచివాలయం నుండి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కు జిల్లా కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ డా. ఎస్.వెంకటేశ్వర్, జేసి ఆర్.గోవింద రావు, డిఆర్ఓ జి. నరసింహులు, తిరుపతి, శ్రీ కాళహస్తి, సూళ్లూరుపేట ఆర్డిఓ లు రామ్మోహన్, భాను ప్రకాష్ రెడ్డి, దేవేంద్ర రెడ్డి, అగ్రికల్చర్ జే డి ప్రసాద్ రావు, ల్యాండ్స్ అండ్ సర్వే ఏ డి రామ చంద్ర, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ రీ సర్వే ను సమర్థవంతంగా నిర్వహించాలని రీ సర్వే కు వెళ్ళే ముందు భూ యజమానికి ముందస్తు సమాచారం పంపాలని తెలిపారు. మాన్యువల్ రెవెన్యూ రికార్డు ల డిజిటలై జేషన్ ను తప్పులు లేకుండా చేయాలని ఆదేశించారు. ఎల్ ని నో కారణంగా వాతావరణం వేడెక్కడంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయని, రైతులు కృత్రిమ ఎరువుల పై ఆధారపడకుండా ప్రకృతి వ్యవసాయం వైపు ఆసక్తి చూపేలా ప్రోత్సహించాలని ఆదేశించారు.

## ప్రజాప్రతినిధులు, అధికారులందరూ తప్పనిసరిగా హాజరు కావాలి

**......పంచాయతీ అభివృద్ధిపై మండల స్థాయి శిక్షణ**

**- ఎంపీడీవో కేజీయ..**




కమలాపురం కదిలించే వార్త జూలై 28

గ్రామ, మండల, జిల్లా పంచాయతీల అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనపై నిర్వహించే మండల స్థాయి ఒకరోజు శిక్షణా కార్యక్రమానికి సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది తప్పనిసరిగా హాజరు కావాలని కమలాపురం మండల పరిషత్ అధికారిని కేజియా తెలిపారు. జూలై 30వ తేదీ ఉదయం 9.30 గంటలకు కమలాపురం మండల ప్రజా పరిషత్ సభాభవనంలో పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై మండల స్థాయి ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. మండల పరిషత్ అధికారి కేజియా మాట్లాడుతూ జిల్లా ప్రజా పరిషత్ ప్రధాన శిక్షణాధికారి, ముఖ్య కార్యనిర్వహణాధికారి ఆదేశాల మేరకు ఈ శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. మండల స్థాయి అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, మండల పరిషత్ అధ్యక్షులు, జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ సహాయకులు, ఇంజినీరింగ్ సహాయకులు, ప్రతి గ్రామ పంచాయతీ నుంచి ఒక స్వయం సహాయక సంఘ ప్రతినిధి, ఇతర శాఖల అధికారులు తప్పనిసరిగా ఈ శిక్షణలో పాల్గొనాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు తమ గ్రామాల పరిధిలోని మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, డిజిటల్ సహాయకులు, ఇంజినీరింగ్ సహాయకులు శిక్షణా కార్యక్రమానికి సకాలంలో హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. శిక్షణకు హాజరయ్యే ప్రతి ఒక్కరూ తమ ఆధార్ కార్డు, ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్ నంబరు వివరాలు, ప్రభుత్వ ఆర్థిక నిర్వహణ గుర్తింపు సంఖ్య వెంట తీసుకురావాలని తెలిపారు. పంచాయతీల సమగ్ర అభివృద్ధికి ప్రణాళికల రూపకల్పనలో ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడు తుందని, అందరూ సమయానికి హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు..

## ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ప్రపంచ ప్రకృతి సంరక్షణ దినోత్సవం ఘనంగా నిర్వహణ



కడప జులై. 28 కదిలించే వార్త ప్రపంచ ప్రకృతి సంరక్షణ దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం జూలై 28న నిర్వహిస్తారు. ఈ సందర్భంగా మంగళవారం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) విద్యార్థుల ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అటవీ అధికారి ప్రసాద్ హాజరై కళాశాల ఆవరణలో మొక్కలు నాటి వాటికి నీరు పోశారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రకృతి పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రతి విద్యార్థి కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని సూచించారు. అడవుల పరిరక్షణ, పర్యావరణ సమతుల్యత, జీవ వైవిధ్య రక్షణలో యువత కీలక పాత్ర పోషించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీమతి టీ .జ్ఞానేశ్వరి, డిస్టిక్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ప్రసాద్, స్టెప్ ఆఫీసర్ వి.వి .సుబ్రమణ్యం, ఫారెస్ట్ రేంజ్ ఎస్ఐ బాలసుబ్రమణ్యం ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ చెప్పలి రాజారావు, అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు కార్యక్రమ అధికారి, విద్యార్థులు పాల్గొని పర్యావరణ పరిరక్షణకు తమ వంతు కృషి చేయాలని ప్రతిజ్ఞ చేశారు.

## సాంఘిక సంక్షేమ హాస్టళ్లను ప్రజాస్వామ్య పర్యవేక్షణకు దూరం చేసే సర్క్యులర్‌ను వెంటనే రద్దు చేయాలి.

**-- బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు సగిలి గురప్ప డిమాండ్**




కడప జూలై 28 కదిలించే వార్త

ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ 07-04-2026న జారీ చేసిన హాస్టళ్లలో అనధికార ప్రవేశాల నివారణ సర్క్యులర్ ప్రజాస్వామ్య స్ఫూర్తికి, భారత రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటనా స్వేచ్ఛకు, మీడియా స్వేచ్ఛకు విరుద్ధంగా ఉందని బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు సగిలి గురప్ప తీవ్రంగా ఖండించారు. విద్యార్థులను బెదిరించే లేదా వసూళ్లకు పాల్పడే వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం అవసరమే. కానీ ఆ కారణాన్ని చూపుతూ అన్ని ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాలు, మీడియాపై ఒకే విధమైన ఆంక్షలు విధించడం అన్యాయం. అందువల్ల ఈ సర్క్యులర్‌ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని, విద్యార్థుల భద్రతను కాపాడుతూనే ప్రజాస్వామ్య హక్కులు, మీడియా స్వేచ్ఛ, సామాజిక పర్యవేక్షణకు భంగం కలగని విధంగా కొత్త మార్గదర్శకాలను రూపొందించాలని బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు సగిలి గురప్ప డిమాండ్ చేశారు.

# రైతన్నకు 'స్టార్టర్' సెగ!

**- బ్రహ్మంగారిమఠం మండలంలో విచ్చలవిడిగా మోటార్లు, వైర్ల చోరీ**

**- అన్నదాన సత్రం పక్కన రైతు రామానాయుడు పొలంలో రెండోసారి దొంగతనం**

**- కేసు నమోదు కాకపోవడంతో చెలరేగిపోతున్న ముఠాలు**

బ్రహ్మంగారిమఠం కదిలించే వార్త జులై 28

ఎండనకా, వాననకా కష్టపడి పంటలు పండిస్తున్న రైతులకు దొంగల భయం నిద్రలేకుండా చేస్తోంది. బ్రహ్మంగారిమఠం మండలంలో గత కొంతకాలంగా వ్యవసాయ విద్యుత్ మోటార్లు, స్టార్టర్లు, కాపర్ వైర్ల చోరీలు విపరీతంగా పెరిగిపోయాయి. తాజాగా స్థానిక పలనాటి అన్నదాన సత్రం సమీపంలోని సారె రామానాయుడు అనే రైతు పొలంలో మంగళవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు స్టార్టర్ పెట్టెను దొంగిలించుకెళ్లారు. సదరు రైతు పొలంలో ఈ తరహా చోరీ జరగడం ఇది రెండోసారి కావడం గమనార్హం.

**ఫిర్యాదు చేయలేక.. మళ్లీ కొనుక్కోలేక!**

మండలవ్యాప్తంగా నిత్యం ఏదో ఒక చోట విద్యుత్ పరికరాలు మాయమవుతున్నప్పటికీ, బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వెనుకంజ వేస్తున్నారు. ఎవరిపై ఫిర్యాదు చేయాలో తెలియక, పోలీస్ స్టేషన్ చుట్టూ తిరిగే ఓపిక లేక తమ ఆవేదనను వాట్సాప్ గ్రూపుల్లో పంచుకుని ఊరుకుంటున్నారు. ఆపై మళ్లీ అప్పులు చేసి కొత్త స్టార్టర్లు కొనుగోలు చేస్తున్నారు. పోలీసులకు అనేక పనులు ఉండటంతో ఇటువంటి చిన్న చిన్న దొంగతనాలపై దృష్టి పెట్టే సమయం ఉండటంలేదని, ఇదే దొంగలకు అవకాశంగా మారుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**పాత నేరస్థులపై కన్నేసేనా?**



గతంలో ఇటువంటి నేరాలకు పాల్పడిన పాత నేరస్థులను, అనుమానితులను పోలీసులు పిలిపించి విచారిస్తే దొంగల ముఠాల ఆచూకీ లభించే అవకాశం ఉందని బాధితులు అభిప్రాయపడుతున్నారు. రాత్రి వేళల్లో పొలాల వైపు రక్షణ గస్తీ పెంచి, దొంగతనాలకు చెక్ పెట్టాలని, త్వరితగతిన నిందితులను పట్టుకుని రైతులకు రక్షణ కల్పించాలని మండల రైతాంగం పోలీసు శాఖను కోరుతోంది.

# విద్యార్థి సంఘాలను హాస్టళ్లలోకి అనుమతించకుండా అడ్డుకోవడం ప్రజాస్వామ్యంపై దాడి

**- విద్యార్థుల సమస్యలను దాచిపెట్టేందుకే ఈ నిరంకుశ వైఖరి**

**-- పీఎస్ఎఫ్**

కడప జూలై 28 కదిలించే వార్త

ప్రభుత్వ హాస్టళ్లలో విద్యార్థి సంఘాల ప్రతినిధులను ఎటువంటి చట్టబద్ధమైన కారణం లేకుండా అనుమతించకుండా అడ్డుకోవడం అత్యంత నిరంకుశ, ప్రజాస్వామ్య వ్యతిరేక చర్య అని ప్రోగ్రెసివ్ స్టూడెంట్స్ ఫెడరేషన్ ( పిఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు కొడవటికంటి నాగరాజు తీవ్రంగా ఖండించారు. మంగళవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూప్రభుత్వ హాస్టళ్లు ప్రజల పన్నుల సొమ్ముతో నిర్వహించబడుతున్నాయని, అక్కడ విద్యార్థులు ఎదుర్కొంటున్న ఆహారం, తాగునీరు, పారిశుద్ధ్యం, భద్రత, వసతి, వైద్య సదుపాయాలు వంటి సమస్యలను తెలుసుకొని పరిష్కారం కోసం పోరాడటం విద్యార్థి సంఘాల ప్రజాస్వామ్యబద్ధమైన బాధ్యత అని అన్నారు. అలాంటి సంఘాలను హాస్టళ్లలోకి అనుమతించకుండా అడ్డుకోవడం ద్వారా విద్యార్థుల గొంతును నొక్కివేయాలనే ప్రయత్నం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థి సంఘాలను భయపడాల్సిన అవసరం అధికారులకు లేదని, హాస్టళ్లలో అన్నీ సక్రమంగా ఉంటే విద్యార్థి సంఘాల ప్రవేశాన్ని ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు. విద్యార్థుల హక్కులను కాలరాస్తూ ఇలాంటి నిరంకుశ చర్యలు కొనసాగితే రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టి,




సంబంధిత అధికారుల కార్యాలయాల ముట్టడితో పాటు ప్రజాస్వామ్యబద్ధమైన నిరసన కార్యక్రమాలను నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్, రాజేష్,నవీన్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# డోర్ టు డోర్ టిడిపి కార్యక్రమం

**- టిడిపి 20 డివిజన్ ఇంచార్జ్ లోమడ చంద్రమోహన్ రెడ్డి**

కడప జూలై 28 కదిలించే వార్త

కడప నగరం హౌసింగ్ బోర్డు కాలని 20వ డివిజన్ లో డోర్ టు డోర్ టిడిపి ప్రోగ్రామ్ లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి, జోనల్ కో ఆర్డినేటర్ శ్రీనివాసులరెడ్డి ఆదేశాలమేరకు తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన ఇంటింటికీ తెలుగుదేశం ప్రోగ్రామ్ టిడిపి 20 డివిజన్ ఇన్చార్జి లోమడ చంద్రమోహన్ రెడ్డి కార్యక్రమం లో పాల్గొనారు. మంగళవారంఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడంతో పాటు, ఆ పథకాల లబ్ధి వారికి అందుతున్న తీరును తెలుసుకుంటూ ఇంటింటికీ వెళ్లి ప్రజల అభిప్రాయాలను సేకరించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల పట్ల ప్రజలు సంతోషంగా స్పందిస్తూ తమ పూర్తి మద్దతును తెలియజేశారు. ఈ కార్యక్రమం లో టిడిపి కలసి బూత్ ఇంచార్జ్ లు సుధాకర్ రెడ్డి, వేణుగోపాల్, నరసింహ రెడ్డి, పుట్ట నరేష్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.



# అనంతపురం నడిబొడ్డున టవర్ క్లాక్ సెంటర్ కలెక్టర్ ఆఫీస్ వరకు.ర్యాలీకి పిలుపు శ్రీ మహర్షి వాల్మీకి సేవా దళ్ రాష్ట్ర అధ్యక్షుడు బుల్లెట్ లింగమయ్య

**అనంతపురం, కదిలించే వార్త, జులై 28 :**


**అనంతపురం నగరంలో ఆగస్టు 1న వాల్మీకి బోయల రాష్ట్రవ్యాప్త ర్యాలీకి వేదిక కానుంది. శనివారం ఉదయం 10:30 గంటలకు టవర్ క్లాక్ సెంటర్ నుంచి ప్రారంభమయ్యే ఈ ర్యాలీ కలెక్టర్ కార్యాలయం వరకు సాగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శ్రీ మహర్షి వాల్మీకి సేవా రాష్ట్ర అధ్యక్షుడు బుల్లెట్ లింగమయ్య**

**తమ డిమాండ్ల సాధనతో పాటు ప్రభుత్వ దృష్టికి సమస్యలను తీసుకెళ్లే ఉద్దేశంతో ఈ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి వాల్మీకి బోయలు భారీ సంఖ్యలో హాజరై కావాలి ర్యాలీని విజయవంతం చేయాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు శ్రీ మహర్షి వాల్మీకి సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు బుల్లెట్ లింగమయ్య మరియు**

**ఈ కార్యక్రమంలో శ్రీ మహర్షి వాల్మీకి సేవాదళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోడాయిపల్లి ఆది, ఎంఆర్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సాయి కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగరాజు, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుష్ప నారాయణరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నీలకంఠారెడ్డి, శ్రీ మహర్షి వాల్మీకి సేవాదళ్ సహాయ కార్యదర్శి చిన్న, తాడిపత్రి కార్యదర్శి చంద్ర, అనంతపురం యూత్ అధ్యక్షుడు జగదీష్, రామలింగయ్య పల్లి, జయకృష్ణ, గురుమూర్తి, రామాంజి పడమలతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొని బోయలకు ఎస్టీ హోదా కల్పించాలని కోరారు.**



# కమల్ అమృత్ వాణి-210



ధర్మో రక్షతి రక్షితః సత్యమూలో హి జీవనే।
ధర్మపథమనుసృత్యైవ శాంతిః సంపదమశ్నుతే॥

తాత్పర్యం.

ధర్మాన్ని కాపాడేవారిని ధర్మమే కాపాడుతుంది.సత్యం ధర్మానికి పునాది.నిజాయితీతో నడిచే జీవితం ప్రశాంతంగా ఉంటుంది.

ధర్మం మనిషికి గౌరవాన్ని అందిస్తుంది.అధర్మం తాత్కాలిక లాభాన్నే ఇస్తుంది.ధర్మాచరణ సమాజానికి ఆదర్శం.ధర్మమార్గం కష్టమైనా శాశ్వత ఫలితాన్ని ఇస్తుంది.ధర్మమే జీవితానికి దిక్సూచి.

-- కమలేకర్ నాగేశ్వర్ రావు 'కమల్'

## మెగా డీఎస్సీ పై బహిరంగ చర్చకు సిద్ధమా..?

**- వైసిపి నాయకులకు ఎమ్మెల్యే దగ్గుపాటి సవాల్**
**- వైసిపి నిరసనలపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసిన దగ్గుపాటి**
**- మీ హయాంలో ఒక్క టీచర్ పోస్ట్ అయినా భర్తీ చేశారా..?**
**- ఆరోపణలు నిరూపిస్తారు కేసులు ఎదుర్కొంటాలో తేల్చుకోవాలని సూచన**



అనంతపురం, కదిలించే వార్త, జులై 28 :

మెగా డీఎస్సీపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్న వైసీపీ నాయకులు బహిరంగ చర్చకు సిద్ధమా అని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సవాల్ విసిరారు. అనంతపురంలో మంగళవారం రోజు మెగా డీఎస్సీ పై వైసీపీ నాయకులు చేపట్టిన నిరసన కార్యక్రమాల మీద ఆయన తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. తన క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ కేవలం 150 రోజుల్లో అత్యంత పారదర్శకంగా మెగా డీఎస్సీ పూర్తి చేశారని.. 16347 పోస్టులు భర్తీ చేశారని ఎమ్మెల్యే అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన హామీ మేరకు మెగా డీఎస్సీ పై తొలి సంతకం చేసి రికార్డు టైంలో దీనిని పూర్తి చేశామన్నారు. అయితే నిరుద్యోగులకు ఉద్యోగాలు వస్తుంటే ఓర్వలేని వైసిపి ఇప్పుడు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం రెండేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను తాము ఇంటింటికి వెళ్లి వివరిస్తుంటే ప్రజలను డైవర్ట్ చేయడానికి ఇలాంటి కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. ప్రజలను స్పందనను చూసి వైసిపి నాయకులు ఓర్వలేకపోతున్నారని ఎమ్మెల్యే విమర్శలు చేశారు. మెగా డీఎస్సీ పై బహిరంగ చర్చకు సిద్ధమని ఇప్పటికే విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చెప్పారని.. అయితే ఇప్పటివరకు వైసీపీ నాయకులు చర్చకు రాకుండా రాజీనామా చేయాలని డిమాండ్ చేయడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మీకు చేతనైతే ఆరోపణలు నిరూపించాలని లేకపోతే కేసులు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు హయాంలో ఇప్పటివరకు నాలుగు మెగా డీఎస్సీలు నిర్వహించారని ఒక్కచోట కూడా అవినీతి ఆరోపణ లేకుండా పూర్తి చేశారన్నారు. అదే బాటలోని మంత్రి నారా లోకేష్ కూడా అత్యంత పారదర్శకంగా మెగా డీఎస్సీ నిర్వహించారని దగ్గుపాటి అన్నారు. డీఎస్సీ ని ఆపటానికి 238 కేసులు వైసిపి నాయకులు వేసినప్పటికీ వాటిని సమర్థవంతంగా మంత్రి నారా లోకేష్ ఎదుర్కొన్నారన్నారు. పేపర్ లీకేజీ అయిందని స్పోర్ట్స్ కోటాలో అక్రమాలు జరిగాయని ఇలా ఇష్టం వచ్చినట్లు ఆరోపణలు చేస్తున్నారన్నారు. వాటిలో ఏ ఒక్క దానికి కూడా వైసిపి నాయకుల వద్ద ఆధారాలు లేవన్నారు. అలాంటి ఆధారాలు ఉంటే బహిరంగ చర్చకు రావాలని దగ్గుబాటి సూచించారు. వైసిపి హయాంలో గ్రూప్ 2 పోస్టులు భర్తీ చేస్తే అందులో 150 మంది నేటికీ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వైయస్ హయాంలో డీఎస్సీ నిర్వహిస్తే ఆరోజు కాంగ్రెస్ నేతల పిల్లలకి ఉద్యోగాలు వచ్చాయన్నారు. వైసిపి హయాంలో జరిగిన సచివాలయ ఉద్యోగాల నియామకాల్లో కూడా అనేక అక్రమాలు జరిగాయన్నారు. కనీసం ఐదేళ్లలో ఒక ప్రభుత్వ ఉద్యోగం కూడా ఇవ్వలేదని... ప్రైవేట్ కంపెనీలు రాలేదు ఉద్యోగాలు ఉద్యోగాలు రాలేదని అన్నారు. ఈరోజు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ కృషితో 25 లక్షల కోట్ల పెట్టుబడులు, 25 లక్షల ఉద్యోగాలు వచ్చాయన్నారు. ప్రత్యేకించి విద్యాశాఖలో అనేక మార్పులు వచ్చాయన్నారు. ఆరోజు ఉపాధ్యాయులను వైన్ షాపుల వద్ద, టాయిలెట్ల వద్ద నిలబెట్టి అవమానించారన్నారు. ఈరోజు అదే ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులకు తగిన గౌరవం కల్పించిన నాయకుడు మంత్రి నారా లోకేష్ అన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థల నుంచి ప్రభుత్వ బడుల్లోకి విద్యార్థులు చేరుతున్నారన్నారు. ఒక్క అనంతపురం అర్బన్ నియోజకవర్గంలోనే 4,000 మంది విద్యార్థులు ప్రైవేట్ విద్యా సంస్థల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చేరారని ఎమ్మెల్యే దగ్గుపాటి అన్నారు. ఫ్యాక్షన్ నేపథ్యంతో వచ్చిన గొడ్డలి పార్టీ నాయకులు నిత్యం ఏదో ఒక వివాదం సృష్టించాలని ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. తన సొంత బాబాయిని హత్య చేసిన వారి మాటలను నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరన్నారు. గత ఎన్నికల్లో వారిని 11 స్థానాలకు పరిమితం చేశారని వచ్చే ఎన్నికల్లో అవి కూడా రావన్నారు. ఇప్పటికైనా వైసీపీ నాయకులు బుద్ధి తెచ్చుకోవాలని.. లేకపోతే కేసులు ఎదుర్కోక తప్పదని ఎమ్మెల్యే దగ్గుపాటి హెచ్చరించారు.

## కూటమి సంక్షేమమే ప్రజల బలం..
## రాయలసీమ అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం: పూల నాగరాజు





అనంతపురం, కదిలించే వార్త, జులై 28 :కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, సూపర్ సిక్స్ హామీల అమలు, రాయలసీమ అభివృద్ధికి కట్టుబడి ఉందని అనంతపురం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు తెలిపారు. కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలన ప్రజలకు వివరించే ఇంటింటి ప్రచార కార్యక్రమంలో అనంతపురం జిల్లా సింగనమల నియోజకవర్గం గార్లదిన్నె మండలం కేశవపురం గ్రామంలోని ఎస్సీ కాలనీ, 6వ బూత్ పరిధిలో నిర్వహించిన కార్యక్రమంలో అనంతపురం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు పాల్గొన్నారు. ఎడిసిసి బ్యాంక్ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, ద్విసభ్య కమిటీ సభ్యుడు ఆలం నరసానాయుడు, మాజీ గ్రంథాలయ చైర్మన్ జిరాయితీ గౌస్ మోద్దిన్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, సూపర్ సిక్స్ హామీల ద్వారా ప్రజలకు అందుతున్న ప్రయోజనాలను వివరించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రజా సంక్షేమం, పారదర్శక పాలనకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. అలాగే ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సమన్వయంతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నారని పూల నాగరాజు పేర్కొన్నారు. రాయలసీమ ప్రాంతానికి సాగునీటి ప్రాజెక్టులు, రోడ్లు, పారిశ్రామిక అభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పన, విద్యా, వైద్య రంగాల బలోపేతానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని ప్రజలకు వివరించారు. ప్రతి కుటుంబానికి సంక్షేమం, ప్రతి ప్రాంతానికి అభివృద్ధి అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.

# పరిగి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ శ్రీ ఎస్. సతీష్ కుమార్, ఐపీఎస్



శ్రీ సత్య సాయి జిల్లా క్రైమ్, కదిలించే వార్త, జులై 28 :

ప్రజలకు మరింత మెరుగైన, పారదర్శకమైన పోలీసింగ్ అందించాలనే లక్ష్యంతో శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ శ్రీ ఎస్. సతీష్ కుమార్, ఐపీఎస్ గారు ఈరోజు పరిగి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.తనిఖీలో భాగంగా స్టేషన్‌లోని ప్రతి విభాగాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తూ, ప్రజలకు వేగవంతమైన సేవలు అందించేందుకు అవసరమైన పలు కీలక సూచనలు చేశారు. స్టేషన్ పరిశుభ్రత, లాకప్ గదులు, రికార్డుల నిర్వహణ, పెండింగ్ కేసుల పురోగతి, పోలీసు సిబ్బంది పనితీరును సమీక్షించి మెరుగైన నిర్వహణపై మార్గనిర్దేశం చేశారు. మండలంలోని సమస్యాత్మక గ్రామాలు, శాంతిభద్రతల పరిస్థితులపై పరిగి ఎస్ఐతో ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించి, ప్రజల భద్రతకు ఎలాంటి లోటు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాత్రి గస్తీ, బీట్ పోలీసింగ్, వాహన తనిఖీలను మరింత సమర్థవంతంగా నిర్వహిస్తూ నేరాలు, చోరీలను అరికట్టేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని ఆదేశించారు. మాదకద్రవ్యాల విక్రయం, రవాణా, వినియోగంపై ఎలాంటి రాజీ లేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రౌడీ షీటర్లు, చరిత్ర కలిగిన నేరస్థులు, బెయిల్‌పై ఉన్న నిందితుల కదలికలపై నిరంతర నిఘా కొనసాగిస్తూ అవసరమైన చోట బైండోవర్ చర్యలు, ప్రత్యేక పెట్రోలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. మహిళలు, చిన్నారుల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని, వారి ఫిర్యాదులపై వెంటనే స్పందించి సత్వర చర్యలు తీసుకోవాలని పోలీసు సిబ్బందికి స్పష్టం చేశారు. అనుమతులు లేకుండా జరుగుతున్న ఇసుక, మట్టి అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని, సీసీ కెమెరాల విస్తరణ ద్వారా నేర నియంత్రణ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని దిశానిర్దేశం చేశారు.ఈ తనిఖీలో పరిగి ఎస్ఐ రవికుమార్ మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. ప్రజల భద్రతే మా ప్రథమ ప్రాధాన్యం... సమర్థవంతమైన పోలీసింగ్ ద్వారానే సురక్షిత సమాజ నిర్మాణం సాధ్యం.

## ఎమ్మెల్యే కె.ఈ. శ్యాంబాబు నాయకత్వంలో ఇంటింటి కార్యక్రమం విజయవంతం..

**- కూటమి ప్రభుత్వంతో అభివృద్ధి సంక్షేమం పరుగులు తీస్తోంది...**
**పత్తికొండ పరిశీలికులు,టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వడ్డే సిమెంట్ పోలన్న**







పత్తికొండ, కదిలించే వార్త, జూలై 28

ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న లి"ఇంటింటి కార్యక్రమం"లిలో భాగంగా పత్తికొండ నియోజకవర్గంలో ఎమ్మెల్యే కె.ఈ. శ్యాంబాబు నాయకత్వంలో విస్తృతంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వడ్డే సిమెంట్ పోలన్న పరిశీలకుడిగా పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకుంటూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం రెండేళ్ల కాలంలో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపించిందన్నారు. ప్రజలకు పారదర్శకమైన పాలన, వేగవంతమైన అభివృద్ధి, సమర్థవంతమైన సంక్షేమ కార్యక్రమాలను అందిస్తూ ప్రజల విశ్వాసాన్ని చూరగొంటోందని తెలిపారు.విద్య, ఐటీ, పరిశ్రమలు, ఉపాధి రంగాల్లో మంత్రి నారా లోకేష్ తీసుకుంటున్న సంస్కరణలు యువతకు బంగారు భవిష్యత్తును అందిస్తున్నాయని, ఆయన చేపడుతున్న కార్యక్రమాలు రాష్ట్ర ప్రగతికి బలమైన పునాది వేస్తున్నాయని కొనియాడారు.దేశ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం సమన్వయంతో పనిచేస్తూ అభివృద్ధిని మరింత వేగవంతం చేస్తున్నాయని పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రజా సమస్యల పరిష్కారం, గ్రామీణాభివృద్ధి, పారదర్శక పరిపాలనకు విశేషంగా కృషి చేస్తున్నారని ప్రశంసించారు.కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని డబుల్ ఇంజిన్ ప్రభుత్వం వల్ల ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి వేగంగా కొనసాగుతోందని, కేంద్ర--రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో భారీ పెట్టుబడులు, మౌలిక వసతుల అభివృద్ధి, ఉపాధి అవకాశాలు, సంక్షేమ కార్యక్రమాలు సమర్థవంతంగా అమలవుతున్నాయని అన్నారు.ఇంటింటి కార్యక్రమం ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతి కుటుంబానికి చేరవేస్తూ, ప్రజల అభిప్రాయాలు, సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఎమ్మెల్యే కె.ఈ. శ్యాంబాబు నాయకత్వంలో పత్తికొండ నియోజకవర్గంలో పార్టీ శ్రేణులు సమిష్టిగా పనిచేస్తూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తున్నారని వడ్డే సిమెంట్ పోలన్న అభినందించారు.ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లిన పోలన్నకు స్థానిక ప్రజలు ఆత్మీయ స్వాగతం పలికారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, వారి నుంచి వచ్చిన వినతులు, సమస్యలను నమోదు చేసి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తూ ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, అభివృద్ధి--సంక్షేమం అనే రెండు చక్రాలతో రాష్ట్రాన్ని మరింత ముందుకు తీసుకెళ్తోందని ఆయన అన్నారు. రానున్న రోజుల్లో కూడా ప్రజల మద్దతుతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రస్థానంలో నిలబెడుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, మహిళలు, యువత మరియు పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# నగరంలో ప్రతి ఇంటి ముందు చెట్టు కనిపించాలి

**- అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచన**
**- ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం సందర్భంగా 2కే రన్**
**- నేచర్ వెల్ఫేర్ కౌన్సిల్ ఆధ్వర్యంలో కార్యక్రమం**
**- ఎల్-నినో వంటి పరిస్థితుల్ని ఎదుర్కోవాలంటే మొక్కలు పెంచడమే ఏకైక మార్గం**
**- యువత దీనిని బాధ్యతగా తీసుకోవాలన్న ఎమ్మెల్యే దగ్గుపాటి**








అనంతపురం, కదిలించే వార్త, జులై 28 :

ఎల్-నినో వంటి వాతావరణ పరిస్థితులను ఎదుర్కోవాలంటే చెట్లు నాటడమే ఏకైక మార్గమని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అభిప్రాయ పడ్డారు. ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం సందర్భంగా అనంతపురం నగరంలో నేచర్ వెల్ఫేర్ కౌన్సిల్ ఆధ్వర్యంలో 2కే రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నేచర్ వెల్ఫేర్ కౌన్సిల్ అనంతపురం చైర్మన్ సూర్య ప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కూటమి నాయకులు, వంలాది మంది విద్యార్థులు, నగర వాసులు పాల్గొన్నారు. టవర్ క్లాక్ వద్ద వ్యాయామం, డ్యాన్సులతో యువత ఆకట్టుకుంది. మొక్కలు పెంచేలా అవగాహన కల్పిస్తూ నిర్వహించిన 2కే రన్ ను ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ ఎల్-నినో వంటి వాతావరణ పరిస్థితులతో వర్షాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఇలాంటి వాటిని ఎదుర్కోవాలంటే మొక్కలు పెంచడమే ఏకైక మార్గమన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. ప్రతి ఇంటి ముందు చెట్టు ఉండాలి..ప్రతి సంస్థ వద్ద చెట్లు కనిపించాలన్నారు. విద్యార్థులు, యువత దీనిపై అవగాహన కల్పించాలని సూచించారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కోసం ప్రతి 3వ శనివారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. గత ప్రభుత్వంలో ఇలాంటి వాటి మీద నిర్లక్ష్యం వహించడంతో పాటు లక్షల టన్నుల చెత్త పెట్టి పోయారన్నారు. ఆ చెత్త నుంచి ఇప్పుడు సంపద సృష్టించేలా ఫ్రెష్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ ఏర్పాటు చేయబోతున్నట్లు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నగర అధ్యక్షుడు సుధాకర్ యాదవ్, బిజెపి రాష్ట్ర నాయకులు లలిత్ కుమార్, సంధి రెడ్డి శ్రీనివాసులు, అనంతలక్ష్మి కళాశాల చైర్మన్ అనంత రాముడు, అటవీశాఖ అధికారులు ఎస్వి డిఫెన్స్ అకాడమీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థులకు ప్రేమతో సైకిళ్ళు అందిస్తున్నా..ఎమ్మెల్యే అమిలినేని

- 5కోట్ల రూపాయలతో 7300 సైకిళ్ళు గ్రామీణ విద్యార్థులకు అందజేస్తున్నాం
- సరస్వతి పుత్రులు, వారి తల్లిదండ్రుల మధ్య సైకిళ్లు అందజేయడం నా అదృష్టం
- మేము చేసే ప్రతి కార్యక్రమానికి మాకు అండగా నిలబడుతున్న ఎస్సార్సీ చైర్మన్ ముత్తినేని రాజగోపాల్, సీఎఫ్ ఓ షీమా, అమిలినేని యశ్వంత్, దేవినేని నవీన్ కుమార్, దేవినేని ధర్మతేజ, దేవినేని అవినాష్ గారికి ప్రత్యేక కృతజ్ఞతలు
- 20 ఏళ్లుగా చదువుకున్న విద్యార్థులకు అండగా ఉన్నాం..ఇక మీద కూడా అండగా ఉంటాం
- తిమ్మసముద్రంలో 4000 ఎకరాల్లో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేసి ఉద్యోగ ఉపాధి కలిస్తాం
- విద్యాశాఖ మంత్రిగా నారా లోకేష్ బాధ్యతలు తీసుకున్న నాటి నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో నాయకుల పేర్లు లేకుండా గొప్ప వ్యక్తుల పేర్లతో అమలు
- కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే డీఎస్సీ ప్రకటన..కళ్యాణదుర్గంలో 1200 మందికి ఉచిత భోజనం, మెటీరియల్ అందించి ఉత్తమ శిక్షణ అందించాం
- 16500 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసిన గొప్ప నాయకుడు నారా లోకేష్
- సాగునీటి ప్రాజెక్టుల్లు పూర్తి చేస్తూ సాగు, తాగు నీరు అందించిన అపర భగీరతుడు చంద్రబాబు నాయుడు
- బీటీపీ పనులకు తాత్కాలికంగా మాత్రమే సంస్థ నిధులు వెచ్చిస్తున్నారు..తిరిగి ప్రభుత్వం చెల్లిస్తుంది
- తల్లిదండ్రులు ఇద్దరు లేని సచిన్ అనే విద్యార్థి తన చదువు బాధ్యత నేను తీసుకుంటా
- విద్యార్థులను ఫోన్ కి, సోషల్ మీడియాకు తల్లిదండ్రులు దూరంగా ఉంచాలి

























కళ్యాణదుర్గం, కదిలించే వార్త, జులై 28 :



విద్యార్థుల పడుతున్న ఇబ్బందులను గుర్తించి వారి చదువులకు ఆటంకం కలగకుండా విద్యను కొనసాగించేందుకు వీలుగా ఉంటుందని ప్రేమతో ఎస్సార్సీ ట్రస్ట్ ద్వారా సైకిళ్లు అందిస్తున్నట్లు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు పేర్కొన్నారు..నేడు శెట్టూరు మండలం ములకలేడు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రామీణ ప్రాంతాల నుంచి పాఠశాలకు వచ్చే 9, 10 తరగతి, ఇంటర్ చదివే విద్యార్థులకు ఉచితంగా సైకిళ్ల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు గారు, మాజీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కరణం రామ్మోహన్ చౌదరి, పార్టీ పరిశీలకులు, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ రామకృష్ణ, వాల్మీకి కార్పొరేషన్ వైపీ రమేష్, మార్కెట్ యార్డు చైర్మన్ గోళ్ళ లక్ష్మీదేవి, మండల పార్టీ అధ్యక్షులు టీఆర్ తిప్పేస్వామి, ఎమ్ ఈ ఓ లు శ్రీధర్, వాణిదేవి తహసీల్దార్ ఈశ్వరమ్మ, స్థానిక నాయకులు పాల్గొని విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశారు..ఈ సందర్భంగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు గారు మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల్లో, ప్రభుత్వ కళాశాలలో విద్యను అభ్యసిస్తున్న 9,10 తరగతి, ఇంటర్ చదివే గ్రామీణ ప్రాంతాల వారికి ఎస్సార్సీ ట్రస్ట్ ద్వారా 5 కోట్ల రూపాయలతో 7300 సైకిళ్లు అందిస్తున్నామన్నారు.మేము చేస్తున్న ప్రతి కార్యక్రమానికి మాకు తోడుగా ఉంటున్న ఎస్సార్సీ సంస్థ చైర్మన్ ముత్తినేని రాజగోపాల్ గారు, సంస్థ సీఎఫ్ ఓ షీమా, సంస్థ ఎమ్ డీ అమిలినేని యశ్వంత్ గారు, డైరెక్టర్లు దేవినేని నవీన్ కుమార్, దేవినేని ధర్మతేజ, దేవినేని అవినాష్ గారికి ప్రత్యేక ధనవాదాలు తెలుపుతున్నా అన్నారు..సంస్థ నేడు బీటీపీకి స్వంత నిధులతో పనులు చేస్తున్నారు అని అది కేవలం తాత్కాలికంగా మాత్రమే తరువాత ప్రభుత్వం బిల్లులు చెల్లెస్తుందని, అలాగే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే డీఎస్సీ ప్రకటించడంతో మన కళ్యాణదుర్గం ప్రాంతంలో ఎక్కువ మంది నిరుద్యోగ యువత ఉన్నారని తెలుసుకుని ఎక్కడో వెళ్లి లక్షలు వెచ్చించి డీఎస్సీ శిక్షణ తీసుకోలేరన్న ఉద్దేశ్యంతో ఉత్తమ శిక్షణ ఇచ్చే అధ్యాపకులను తీసుకువచ్చి ఇక్కడే వారికి ఉచితంగా శిక్షణతో పాటు, భోజన వసతి కల్పించి నాణ్యమైన స్టడీ మెటీరియల్ అందించామని, కూటమి ప్రభుత్వం డీఎస్సీ నిర్వహించి ఏకంగా 16500 ఉపాధ్యాయులను నియమించిందన్నారు..కళ్యాణదుర్గం ప్రాంతంలో తిమ్మసముద్రం వద్ద 4000 ఎకరాలలో ఇండస్ట్రీయల్ కారిడార్ ఏర్పాటు చేసి ఈ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, గత 20 ఏళ్లుగా విద్యార్థులకు అండగా ఉన్నామని ఇక ముందు కూడా అది కొనసాగిస్తామని, ఇదే పాఠశాలలో చదివే సచిన్ అనే విద్యార్థికి తల్లిదండ్రులు ఉద్దరు లేరన్న విషయం తెలిసిందనిఆవిద్యార్థిచదువుబాధ్యత పూర్తిగా తాము తీసుకుంటామన్నారు.

# దగా డీఎస్సీపై 'అనంత' పోరుబాట

- వైసీపీ యువజన, విద్యార్థి విభాగంలో అనంతపురంలో కదంతొక్కిన యువత, విద్యార్థులు, వైసీపీ శ్రేణులు



















అనంతపురం, కదిలించే వార్త, జులై 28 :

రాష్ట్రంలో దగాపడ్డ డీఎస్సీ అభ్యర్థులకు అండగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అనంతపురంలో వైఎస్ఆర్సీపీ యువజన, విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో భారీ ర్యాలీ ప్రభుత్వ సర్వజనాస్పత్రి ఎదురుగా ఉన్న అనంత వెంకటరెడ్డి విగ్రహం వద్ద నుంచి సప్తగిరి సర్కిల్ వరకు ర్యాలీర్యాలీలో పాల్గొన్న వైఎస్ఆర్సీపీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, పార్లమెంట్ పరిశీలకులు నరేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు విశ్వేశ్వరరెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, రాయదుర్గం సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్, ప్రజాప్రతినిధులు, వైసీపీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గాల నేతలు, కార్యకర్తలు డీఎస్సీ నియామకాల్లో అక్రమాలు జరిగాయంటూ ఆగ్రహండీఎస్సీలో స్పోర్ట్స్ కోటా పేరుతో భారీ కుంభకోణం జరిగిందని ఆరోపణఅక్రమాలపై తక్షణం సీబీఐ విచారణ చేయించాల్సిందేనని డిమాండ్ డీఎస్సీ అక్రమాలకు నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలన్న వైఎస్ఆర్సీపీ నేతలునిరుద్యోగ భృతి, ఫీజురీయింబర్స్‌మెంట్‌పై గళం విప్పిన విద్యార్థులు, యువతప్రతి నిరుద్యోగికి నెలకు రూ.3 వేలు చొప్పున ఇస్తామన్న నిరుద్యోగ భృతి రెండేళ్లుగా ఎందుకివ్వలేదు? అంటూ సూటి ప్రశ్న ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు తక్షణం విడుదల చేయాలని డిమాండ్

Printed, Published, Owend by Neeruganti Shashikala& Printed at Sreenivasa Offset Printers D.No 12-73-A, Sai Nagar, Anantapur (Dt)APTEL/RNI NO/2021/81405 & Published at D. NO. 12-73-A, Sai Nagar. Anantapur . ANANTAPUR (Dt).(A.P) Editior Neeruganti Shashikala Cell : 6303427710